# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :157 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 18-08-2024 | పేజీలు:4 వెల: 2.00


## మళ్లీ ఫోన్ పే లో విద్యుత్ చెల్లింపులు

హైదరాబాద్ : విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్ వినించాయి ఆ శాఖలు . మళ్లీ యూపీఐ పేమెంట్స్ ను స్వీకరిస్తున్నట్లు కీలక ప్రకటన చేసింది. జులై 1 నుంచి ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి విద్యుత్ బిల్లుల చెల్లింపు ప్రక్రియలో మార్పులు వచ్చిన విషయం తెలిసిందే.దీనిలో భాగంగానే ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే వంటి యాప్స్ ద్వారా చెల్లించడం నిలిపివేసినట్లు ఇటు తెలంగాణ ,అటు ఎపి విద్యుత్ పంపిణీ సంస్థలు తెలిపాయి. కరెంట్ బిల్లుల చెల్లింపులను స్పీడప్ చేసేందుకు భారత్ బిల్ పేమెంట్ సిస్టమ్ లో చేరాయి. దాని ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాలని వినియోగదారులను కోరాయి. అయితే ఈ కొత్త విధానం అర్థంకాక గత నెలలో కేవలం 40 శాతం బిల్లులు మాత్రమే వసూలు అయ్యాయి.. ఇక గ్రామీణ ప్రాంతాలలో అయితే విద్యుత్ బిల్లులు కేంద్రాల వద్ద వినియోగదారులు బారులు తీరారు.. పరిస్థితిని గమనించిన విద్యుత్ బోర్డులో తిరిగి పాత విదానాన్ని అమలు చేస్తునట్లు ప్రకటించాయి..

## తెలంగాణలో పదవుల పందేరానికి మరోసారి బ్రేక్ పడిందా?



హైదరాబాద్,తెలంగాణలో పదవుల పందేరానికి మరోసారి బ్రేక్ పడిందా? కాంగ్రెస్‌లో అపరిమిత ప్రజాస్వామ్యమే పదవుల భర్తీకి అడ్డుగా మారిందా? సీనియర్ల పంతంతో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ నియామకంపై అధిష్టానం అడుగు ముందుకు వేయలేకపోతోందా? సీఎం రేవంత్‌రెడ్డి తాజా పర్యటన తర్వాతైనా పరిస్థితిలో మార్పురాలేదా? సీనియర్లు పట్టువీడకపోవడం వల్ల ఆశావహులు మరికొన్నాళ్లు నిరీక్షించాల్సిందేనా? తెలంగాణ కాంగ్రెస్ పాలిటిక్స్‌లో తాజా అప్డేట్స్ ఏంటి?మంత్రి, పీసీసీ చీఫ్ పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు మరికొన్నాళ్లు వేచిచూడక తప్పని పరిస్థితి కనిపిస్తోంది. కాంగ్రెస్ మార్క్ రాజకీయంతో పదవుల భర్తీ ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఒక్క అడుగూ ముందుకు పడలేదని సమాచారం. రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ నియామకంపై కొంత కాలంగా కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తున్నా పార్టీలో ఏకాభిప్రాయం కుదరక మళ్లీ మళ్లీ వాయిదా పడుతోంది.తాజాగా ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ సారి ఎలాగైనా అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ తేవాలని ప్రయత్నిస్తున్నా, సీనియర్ల మోకాలడ్డుతో మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ లభించలేదని తెలుస్తోంది. ప్రస్తుతం పీసీసీ చీఫ్‌తో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. జూన్ 27తో పీసీసీ చీఫ్ పదవీకాలం ముగియడంతో కొత్త వారిని నియమించాలని భావించింది కాంగ్రెస్ అధిష్టానం. రకరకాల సమీకరణలపై సీనియర్లతో చర్చించింది.

### ఎప్పటికప్పుడు వాయిదా

ఐతే ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వస్తోంది. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు పలువురు నేతలతో అధిష్టానం రెండుసార్లు చర్చించింది. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పేర్లు పరిశీలనకు వచ్చినా, ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మరోసారి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఎంపీగా బలరాం నాయక్, ఎమ్మెల్సీగా మహేశ్ కుమార్ గౌడ్ ఉండటంతో మధుయాష్కీ వైపే కొంత మొగ్గు ఉన్నప్పటికీ లైన్ మాత్రం క్లియర్ అవ్వడం లేదంటున్నారు.ఇక మంత్రివర్గ విస్తరణలో తమ అనుచరులకు పదవులు ఇప్పించుకోవాలని సీనియర్లు ప్రయత్నస్తుండటంతో ఆ ప్రక్రియ ముందుకు కదలడం లేదు. ఇటు మంత్రివర్గం, అటు పీసీసీ చీఫ్ నియామకంలో ఒకదానికొకటి లింకు పెట్టడంతో పదవుల భర్తీ నాన్‌స్టాప్ సీరియల్‌గా మారిపోయింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా, దాదాపు 12 మంది పోటీ పడుతున్నారు. మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని జిల్లాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేమ్‌సాగర్ రావు, వివేక్ పోటీ పడుతున్నారు.వీరిలో ప్రేమ్‌సాగర్‌రావు పేరును డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బలంగా సమర్థిస్తుంటే%ౌ% వివేక్ వైపు సీయం రేవంత్ మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. అటు వివేక్ సోదరుడు మాజీ మంత్రి వినోద్ కూడా తనవంతు ప్రయత్నాలు తాను చేసుకుంటున్నారు. దీంతో ఆ జిల్లాలో ఎవరికి చోటు ఇవ్వాలనేది తేల్చుకోలేకపోతున్నారంటున్నారు. అదేవిధంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డి, మదన్మోహనరావు మధ్య పోటీ కనిపిస్తోంది. ఇద్దరూ ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారంటున్నారు. సుదర్శన్ రెడ్డి వైపు రేవంత్ మొగ్గు చూపుతుంటే ఇతర సీనియర్ల సహకారం, ఢిల్లీ లాబీయింగ్ చేస్తున్నారట మదన్ మోహన్.

### ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్డ్డి పోటీ పడుతుంటే

హైదరాబాద్ కోటాపై దానం నాగేందర్ ఆశలు పెట్టుకున్నారు. ఇక మంత్రివర్గంలో బెర్తు కోసం తనకు హామీ ఇచ్చారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పట్టుబడుతుండగా, అదే జిల్లా నుంచి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎస్టీ సామాజిక వర్గం నుంచి బాలు నాయక్ తమవంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

### పరిశీలనలో మరింత మంది పేర్లు

మున్నూరు కాపు వర్గం నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ %ౌ% ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి శ్రీహరి ముదిరాజ్ మంత్రి పదవి ఆశిస్తున్నారు. బీసీ రజక కోటాలో రేవంత్ కు సన్నిహితుడైన వీర్లపల్లి శంకర్ తన పేరును పరిశీలించాలని కోరుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో బి.ఆర్.ఎస్ ను ఎదుర్కొవాలంటే తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని మైనంపల్లి రోహిత్ కోరుతుండగా అక్కడ హరీశ్, రఘునందన్ లాంటి వారికి చెక్ పెట్టేందుకు రోహిత్ సరైనోడేనని భావనలో సీఎం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.సీఎం రేవంత్ రెడ్డి ఈసారి మంత్రివర్గంలో తనకు అనుకూలమైన వ్యక్తులను తీసుకునేందుకు ప్రయత్నిస్తుంటే.. చాపకింద నీరులా సీనియర్ నేతలు తమ సన్నిహితులకు బెర్త్ కోసం పట్టుబడుతున్నారని చెబుతున్నారు. దీంతో మంత్రివర్గం విషయంలో లెక్కలు ఏమాత్రం సరితూగడం లేదని సమాచారం. మంత్రివర్గ లెక్కలు కుదిరితే.. పీసీసీ అంశాన్ని తేల్చవచ్చని భావిస్తోన్న అధిష్ఠానం రెండింటినీ వాయిదా వేసినట్లు చెబుతున్నారు.దీంతో ముచ్చటగా మూడోసారి కూడా పీసీసీ, మంత్రివర్గ విస్తరణ అంశం వాయిదా పడినట్లేనంటున్నారు. ఇక రాష్ట్రంలో అగ్రనేతలు పర్యటన ఉన్నందున ఈ నెలలో పదవుల భర్తీ ఉండదని, రాజ్యసభ ఎన్నికల తర్వాత సెప్టెంబర్లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని తెలుస్తోంది. ఏదేమైనా సీనియర్ల పంచాయతీ మరోసారి ఆశావహుల ఆశలపై నీళ్లు చల్లేసింది.

## నాకే రక్షణ లేదు ప్రజలకేం ఇస్తారు..

సిద్ధిపేట : ప్రజా పాలనలో ప్రజా ప్రతినిధినైనా తన కార్యాలయంపై దాడి చేయడం ఉన్మాదానికి పరాకాష్ట అని సిద్దిపేట ఎమ్మెల్యే ,మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు కాంగ్రెస్ గూండాలు తమ కార్యకర్తలపై దాడులకు తెగపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకే రక్షణ లేకపోతే ప్రజలకేం రక్షణ ఇస్తారని రేవంత్ సర్కార్ ను నిలదీశారు.. సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుత సిద్ధిపేట ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ గూండాలు దాడి చేసి తాళాలు పగలగొట్టారని ఆరోపించారు.ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఈ దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులే దుండగులను రక్షించడం మరింత శోచనీయం అని విమర్శించారు. ఒక ఎమ్మెల్యే నివాసంపైనే ఇంత దారుణంగా దాడి జరిగిందంటే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి ? అని ప్రశ్నించారు. పోలీసుల సమక్షంలో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడం కాంగ్రెస్ మార్క్ పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఈ ఘటనపై రాష్ట్ర డీజీపీ వెంటనే స్పందించి, చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.


### అసలేం జరిగింది..

సిద్దిపేటలో అర్ధరాత్ర ఫ్లెక్సీ వార్ జరిగింది. అర్ధరాత్రి హైడ్రామా నడిచింది. మాజీ మంత్రి హరీష్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కోరుతూ సిద్దిపేటలో ఫ్లెక్సీలు వెలిశాయి. 'రూ. 2 లక్షల రుణమాఫీ అయింది. నీ రాజీనామా ఎటు పాయె.. అబద్ధాల హరీశ్ రావు' అంటూ సిద్ధిపేట



కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ పేరిట పట్టణంలో ఫ్లెక్సీ బ్యానర్లు వెలిశాయి. ఈ ఫ్లెక్సీలపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించాలని బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి.ఫ్లెక్సీలను తొలగించాలని బీజేఆర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో అలర్ట్ అయిన పోలీసులు.. ఆందోళనకు దిగిన బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. దీంతో బీజేఆర్ చౌరస్తాలో కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. మరోవైపు.. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు సైతం ఆందోళనకు దిగాయి. ఇలా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆందోళనలతో సిద్ధిపేటలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పోలీసులు సైతం భారీగా మోహరించారు. ఈ నేపథ్యంలో కొందరు హరీశ్ కార్యాలయంపై దాడి చేసి తలుపులను, ఫర్నిచర్ ను ధ్వంసం చేశారు..


## పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి చంద్రబాబే కారణం..



అమరావతి,పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతినడానికి చంద్రబాబు ప్రభుత్వం తప్పిదమే కారణమని వైసీపీ ఆరోపించింది. గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేయకుండానే.. ప్రధాన డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేసి చారిత్రక తప్పిదాన్ని చేశారని ఆక్షేపించారు. 2017, 2018లో గోదావరి ప్రవాహం డయాఫ్రమ్ వాల్ మీదుగా ప్రవహించకముందు.. ఆ వరద ప్రభావం డయాఫ్రమ్ వాల్‌పై పడకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోలేదని.. దాంతోనే కోతకు గురై దెబ్బతిందని సీడబ్ల్యూసీకి అంతర్జాతీయ నిపుణుల కమిటీ నివేదిక అందజేసిందని తెలిపింది.గాడి తప్పిన పోలవరం పనులను 2019 తర్వాత వైసీపీ ప్రభుత్వం చక్కదిద్దిందని వైసీపీ తెలిపింది. 2020లో ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్‌పై వరద ప్రభావం పడకుండా పూర్తిస్థాయిలో రక్షణాత్మక చర్యలు చేపట్టిందని వివరించింది. గోదావరి వరద ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్‌ను పూర్తి చేసిందని పేర్కొంది. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనుల నాణ్యత ప్రమాణాల మేరకు ఉందని స్పష్టం చేసింది. వైసీపీ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ తీవ్రంగా మండిపడింది.పోలవరం ప్రాజెక్టులో ప్రస్తుతం నిర్మించిన డయాఫ్రమ్‌వాల్‌కు ఎగువన కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని విదేశీ నిపుణుల బృందం సూచించింది. ఇందుకు రెండు ప్రతిపాదనలను తన నివేదికలో చర్చించింది. ఒకే సీజన్‌లో పనికి అంతరాయం లేకుండా పూర్తి చేయడం లేదా ప్రధాన డ్యామ్ పని ఒక స్థాయి వరకు పూర్తి చేసుకుని, ఆ తర్వాత డయాఫ్రమ్ వాల్ నిర్మించడం.. ఇలా చేస్తే వానకాలంలోనూ డయాఫ్రమ్ వాల్ నిర్మించుకోవచ్చని ఆ నివేదికలో అభిప్రాయపడింది. కాగా, డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులను పాత కాంట్రాక్టు సంస్థ మేఘాకే అప్పగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఏపీ సీఎం చంద్రబాబు శుక్రవారం చర్చించి ఇద్దరు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

## కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు షాకిచ్చిన గవర్నర్..

బెంగళూర్ :కర్ణాటక రాజకీయాల్లో మైసూరు నగరాభివృద్ధి ప్రాదికార (ముడా) కుంభకోణం కలకలం సృష్టిస్తోంది. దానివల్ల ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదరవుతున్నాయి. తాజాగా కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముడా స్థలం కేటాయింపు కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారణ చేసేందుకు గవర్నర్ శనివారం ఉదయం ఆమోదం తెలిపారు. దీంతో ఈ కేసులో సీఎం విచారణను ఎదుర్కోనున్నారు. దీనికి సంబంధించిన సమాచారం అందినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.సామాజిక కార్యకర్త, న్యాయవాది టిజె అబ్రహం తన భార్య బీఎం పార్వతికి కేటాయించిన భూమికి సంబంధించిన కేసులో సీఎం సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతించాలని కోరుతూ కొద్దివారాల క్రితం గవర్నర్ కు పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్ పై గవర్నర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఎం సిద్ధరామయ్యపై విచారణకు ఆమోదం తెలిపారు. కొద్దిరోజుల ముందు తనపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్ ను గవర్నర్ తిరస్కరిస్తారని సీఎం సిద్ధరామయ్య విశ్వాసం వ్యక్తం చేశారు.గవర్నర్ తావర్ చంద్ గెహ్లాట్ నిర్ణయంతో రాజ్ భవన్, ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో సీఎం సిద్ధరామయ్య ప్రత్యేక కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇవాళ సాయంత్రం 5గంటలకు ప్రత్యేక మంత్రివర్గ సమావేశం జరగనుంది. విచారణకు గవర్నర్ అనుమతి



ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ఈ సమావేశం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అలాగే ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే దానిపై కూడా మంత్రివర్గం సమావేశంలో చర్చించనున్నారు.గవర్నర్ విచారణకు అనుమతి ఇవ్వడంతో సిద్ధరామయ్యపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే అవకాశం ఉంది. ఈ విషయంలో రాజకీయంగా, న్యాయపరంగా, ప్రభుత్వం ఓవైపు దీన్ని ఎదుర్కొంటుంది. దీంతోపాటు సీఎం సిద్ధరామయ్య నైతికంగా రాజీనామా చేయాలని డిమాండ్ కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యం లో కర్ణాటక తదుపరి రాజకీయాలు ఆసక్తికరంగా మారబోతున్నాయని చెప్పొచ్చు.

## దేశ వ్యాప్తంగా స్థంభించిన వైద్య సేవలు

న్యూఢిల్లీ :కోల్ కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా వైద్యుల నిరసన ఉధృతం అవుతోంది.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేటి నుంచి దేశవ్యాప్త సమ్మెకు పిలుపు ఇచ్చింది.. దీంతో దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో అత్యవసర సేవలు మినహా అన్ని సర్వీస్ లు నిలిచిపోయాయి..ఇది ఇలా ఉంటే కోల్ కతాలోని ఆర్జీ కేర్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ 31 ఏళ్ల పోస్టు గ్రాడ్యుయేట్ ట్రైనీ వైద్యురాలిపై అత్యాచారం,హత్య జరగడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది.ఆగస్టు 9న జరిగిన ఈ ఘటన కోల్ కతాలో భారీ ఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి.దీంతో దేశవ్యాప్తంగా వైద్య వర్గాలు నిరసనలు, సమ్మెలకు దిగాయి.శనివారం ఉదయం 6 గంటల నుంచి 24గంటల పాటు సమ్మె చేపట్టనున్నట్లు ఐఎంఏ శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే.దీనికి వైద్య వర్గాలు కూడా మద్దతు ప్రకటించాయి.ఈ నేపథ్యంలోనే వైద్యులు విధుల బహిష్కరించి సమ్మెకు దిగారు..

### ఏ సేవలు పనిచేస్తాయి? ఏవి పనిచేయవు?

-శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 18 ఆదివారం ఉదయం 6




గంటల వరకు సమ్మె కొనసాగనుంది

- ఈ వారాంతంలో చాలా ఆసుపత్రి విభాగాలు బంద్ ఉంటాయి. సాధారణ ఔట్ పేషెంట్ విభాగాలు (ఓపీడీలు), ఎలక్టివ్ సర్జరీలు బంద్ కానున్నాయి.
- ఎమర్జెన్సీ సేవలు యథావిధిగా కొనసాగుతాయి.
-ఏవైనా ఎమర్జెన్సీ వైద్య అవసరాలు తలెత్తితే వాటిని కొనసాగించే విధంగా క్యాజువాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయి.

## వైసీపీకి మాజీ ఉప ముఖ్యమంత్రి గుడ్ బై..



అమరావతి, మాజీ మంత్రి ఆళ్ల నాని వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం తొలిసారి మీడియా ముందుకు వచ్చిన ఆళ్ళ నాని వైసీపీలో ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

కొద్దిరోజుల క్రితమే ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా, నియోజకవర్గ ఇన్ ఛార్జ్ గా రాజీనామా చేశానని, వ్యక్తిగత కారణాలతో, వ్యక్తిగత బాధ్యతలతో ఇవాళ పార్టీకి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.కొద్దికాలం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడంతోనే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. భవిష్యత్తు కార్యాచరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండేందుకు నిశ్చయించుకున్నట్టుగా ఆళ్ళనాని స్పష్టం చేశారు.

## ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ..



వికారాబాద్, ఆగస్టు 17: పశ్చిమ బెంగాల్ లోని కోల్కతాలో వైద్య విద్యార్థులపై అత్యాచారం హత్య చేయడం నివసిస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సినీమాక్స్ థియేటర్ నుండి ఎన్టీఆర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వికర్మ శాఖ అధ్యక్షులు డాక్టర్లు నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్లు మధుసూదన్ రెడ్డి డాక్టర్ టి ఆనంద్ డాక్టర్ పురుషోత్తం డాక్టర్ గిరిష డాక్టర్ సృజన్ తో పాటు వంకధర శ్రీనివాస్ అశోక్, వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు మాధవ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఎస్కె శిరీష, పట్టణ అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, నాయకులు రవితేజ, తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ సాధువు సత్యం మాట్లాడుతూ%ౌ% వైద్య విద్యార్థిపై అత్యాచారం, హత్య చేయడం సమంజసం కాదన్నారు. రాబోయే రోజుల్లో డాక్టర్లు మరింత నిరసన వ్యక్తం చేస్తామని ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సంపాదకీయం

**ఆదివారం 18-08-2024**

# వయనాడ్‌కు దక్కింది సానుభూతే

తిప్పుడు తిరుపతి వెళ్లనూ వెళ్లాడు తిరిగి రానూ వచ్చాడు అన్నది ఓ ముతక సామెత. కానీ ఇది ఇటీవల తీవ్ర ప్రకృతి వైపరీత్యానికి గురైన కేరళలోని వయనాడ్‌లో ప్రధానమంత్రి మోదీ పర్యటనకు అతికినట్టుగా ఉంది. సాధారణంగా బీజేపీలో అధికారంలో ఉన్న రాష్ట్రాలు తప్ప ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కున్నా మోదీకి చీమ కుట్టినట్లయినా ఉండదు. కానీ ఎందుకో ఆయనకు వర్ష బీభత్సానికి గురైన వయనాడ్ ప్రజల బాధలపై సానుభూతి కలిగింది. దాదాపు 15 నెలల నుంచి అంతర్యుద్ధం లాంటి పరిస్థితి ఎదుర్కొంటున్న మణిపూర్‌లో మోదీకి తీరిక చిక్కలేదు. కానీ వయనాడ్ ప్రజలపై ఏ కారణంతో దయ కలిగింది. కేరళ శాసనసభ ఎన్నికలు జరగడానికి ఇంకా ఏడాదికి పైగానే సమయం ఉన్నా వర్ష బాధితులను పరామర్శించడానికి తీరిక చేసుకున్నారు. ఈ ఔదార్యానికి సంతోషించవలసిందే. చాలా ప్రాంతాలలో జరిగిన నష్టాన్ని ఆయన హెలికాప్టర్ నుంచే పరిశీలించారు. కానీ కొన్ని చోట్ల ప్రత్యక్షంగా నష్టాన్ని రెండున్నర గంటల పాటు గమనించారు. ఇది మహా విపత్తు అని రాణి కన్నీటి బొట్లు కార్చారు. కానీ కేరళను ఆదుకోవడానికి మాత్రం ఇప్పటి వరకు ఆయనకు మనసు ఒప్పినట్టు లేదు. ఆర్థిక సహాయం మాట అలా ఉంచినా కేంద్ర మంత్రులు మాత్రం నోరారా కేరళ ప్రభుత్వాన్ని నిందించే పనిలో మునిగిపోయారు. అది మహా విపత్తు అని మోదీ వ్యాఖ్యానించడం, ఏ సహాయమూ అందించకుండా ఉండి మోదీ బూటకాల్లో ఒకటి అయి ఉంటుందని మోదీ మంత్రివర్గ సభ్యులు కోరుకుంటున్నట్లు చెప్పారు. అందుకే శాపనార్థాలు పెడుతున్నారు. తమ వ్యాఖ్యల ద్వారా రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారు. ఇది శవాలమీద చల్లే పేలాలు ఏరుకోవడం లాంటిదే. కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ మరీ బరితెగించి వయనాడ్ బాధితులు అందరూ అక్రమంగా నివాసం ఉంటున్న వారేనని నోటికొచ్చినట్టు మాట్లాడారు. వీరు ఆక్రమణలకు ఉన్నారు ఆపదకొని తెచ్చారు అని అన్నారు. దీనికి అమిత్ షా ఆడిన అబద్ధాలు ప్రేరణ కలిగించాయి. బీభత్సమైన వర్షం కురుస్తుందని వాతావరణశాఖ హెచ్చరించిన కేరళ ప్రభుత్వం చలించలేదని అమిత్ షా సహజ ధోరణిలో అసత్య ఆరోపణలు చేశారు. కానీ అమిత్ షా మాటలు ఎంత తీవ్రమైన అబద్ధాలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రుజువులతో సహా నిరూపించిన తరవాత కానీ అమిత్ షా నోరు మూతపడలేదు. ప్రకృతి విలయానికి గురైన వయనాడ్‌ను సందర్శించినందుకు లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అభినందించడమూ వృథా అని తేలిపోయింది. వయనాడ్ విపత్తును ప్రధానమంత్రి మోదీ జాతీయ విపత్తుగా పేర్కొన్న రాహుల్ ఆశ కూడా వమ్ము అయింది. సానుభూతి వచనాలు పలకడం తప్ప ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదిలించలేదు. జాతీయ విపత్తుగా ఉంటే ఆ బాధ కేంద్రం తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించవలసి వస్తుంది. మోదీకి అది సుతారాము ఇష్టం లేదు. కేంద్రం చేసిన సహాయమల్లా సహాయ కార్యకలాపాలు సైన్యాన్ని, నౌకా దళాన్ని, వైమానిక దళాన్ని, జాతీయ విపత్తు నివారణ విభాగాన్ని రంగంలోకి దించడం మాత్రమే. కేరళకు ఎదురైన విపత్తును జాతీయ విపత్తుగా పరిగణించాల్సిందేనని నిపుణులూ ఘోషించారు. ఇంత నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కోవడం సాధ్యం కాదని కూడా చెప్పారు. కనీసం దీన్ని తీవ్ర విపత్తుగానైనా కేంద్రం ప్రకటించవచ్చునని మరి కొందరు అంటున్నారు. అలా పార్లమెంటు ఉభయసభల సభ్యులు తమ స్థానిక అభివృద్ధి నిధుల నుంచి కొంతైనా వయనాడ్ పునరావాసానికి కేటాయించే అవకాశం ఉంటుంది. 2018లో కేరళలో వరదలు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం దాన్ని తీవ్ర ఉపద్రవంగా ప్రకటించింది. ఇప్పుడు అది లేదు. కేరళ ప్రభుత్వం కోరుతున్నదల్లా వయనాడ్ ప్రజలకొచ్చిన కష్టాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించాలని మాత్రమే. ఇలా ప్రకటించడానికి చట్టం ఒప్పుకోదు అని సురేశ్ గోపి లాంటి కేంద్ర మంత్రులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. వయనాడ్ ఆపద లాంటివి చట్టాల మాటున దాక్కోవడానికి ఉపకరించకూడదు. కేంద్ర ప్రభుత్వం సమగ్రమైన సహాయ, పునరావాస పథకం ప్రకటించాలని కోరుతోంది. బాధిత కుటుంబాల కోసం ఓ టౌన్‌షిప్ నిర్మించాలని కేరళ కోరుతోంది. వయనాడ్‌లో వర్ష బీభత్సానికి గురైన ప్రాంతాలపై కేంద్ర మైనారిటీ వ్యవహారాలు, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి జార్జ్ కురియన్ పంపిన నివేదిక ప్రధానమంత్రికి అందింది. అయినా ఉలుకూ పలుకూ లేదు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కేరళ ప్రభుత్వ అభ్యర్థనపై నివేదిక ఇవ్వడానికి తొమ్మిది మందితో ఓ కమిటీని నియమించింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను గమనించారట. కేరళకు ఎదురైన ఆపదను మోదీ ప్రభుత్వం, కుటిల రాజకీయాలకు అలవాటు పడిన ఆయన మంత్రివర్గ సభ్యులు కేవలం సంకుచిత రాజకీయ హ్రస్వ దృష్టితోనే చూస్తున్నారు. ఇది మానవతా దృక్పథం బొత్తిగా లేకపోవడానికి చిహ్నం. ప్రతి అంశాన్నీ బీజేపీకి ఎన్నికలలో ఎలా ఉపయోగ పడ్తుంది అన్న దృష్టితోనే చూడడం అమానుషం. ప్రతిపక్షాల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాలు ఈ దేశంలో భాగమని మోదీ కేవలం బీజేపీకి ప్రధానమంత్రి కాదని, దేశమంతటికీ ప్రధాని అన్న ఆలోచనే ఈ సంకుచిత జీవులకు ఎప్పటికైనా అర్థం అవుతుందన్న ఆశ లేదు. ఉత్తరాఖండ్‌లో వర్ష బీభత్సానికి కొండచరియలు విరిగి పడినప్పుడు, రోడ్లకు అడ్డంకులు ఏర్పడడమే కాకుండా కొన్ని రోడ్లు మాయమై పోయినప్పుడూ మోదీ, ఆయన వంది మాగధులు ఇలాగే వ్యవహరించారా! బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి పరిస్థితే ఏర్పడితే నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోతారా? అర్థం పార్థంలేని వితండ వాదానికే దిగుతారా? దేశంలో బీజేపీ ఓటర్లు మాత్రమే ఉండరు. జనం ఉంటారు. వారినందరినీ పట్టించుకోవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే కాదు. కేంద్రానికి సంపూర్ణమైన బాధ్యత ఉంటుంది. వాయనాడ్‌లో ప్రజల విపత్కర పరిస్థితిని గమనించిన ప్రధానమంత్రి మోదీ కేరళ ప్రజలను ఆదుకోవడం దగ్గరకొచ్చేసరికి పిడికిలి మూసుకోవడం ఏ లెక్కకైనా సబబైంది కాదు. పైగా అది బాధ్యతా రాహిత్యం. పక్షపాత దృష్టి. అ ఎన్నికలలో ప్రయోజనం కోణం నుంచే చూస్తే కొంచెపుతనం. వయనాడ్ నియోజక వర్గం నుంచి 2019లో రాహుల్ గాంధీ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికలలో వయనాడ్‌తో పాటు రాయబరేలీ నుంచి కూడా పోటీ చేసి రెండు చోట్ల నెగ్గారు. వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకున్నారు. అక్కడ బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే తప్ప మోదీ ప్రభుత్వం నాలుగు రాళ్లు విదిలించదేమో!

# దేశ సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ !



న్యూఢిల్లీ,దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రధానికి అవగాహన లేనట్లుగా ఉంది. లేదా..కావాలనే వాటిని పట్టించుకోవడం లేదా.. అన్నది అర్థం కావడం లేదు. ప్రధాని మోడీ ఎర్రకోట వేదికగా చేసిన ప్రకటనలపై విమర్శలు ఎలా ఉన్నా.....దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలపై ప్రధాని మోడీ ఎక్కడా తన ప్రసంగంలో ప్రకటించలేదు. ఇంట్లో ఈగల మోత ..బయట పల్లకి మోత అన్న చందంగా మోడీ తీరు ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించరు. ప్రస్తావించరు. చెబితే వినరు అన్న చందంగా మోడీ పదేళ్ళ పాలన సాగింది. దేశం ఎదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై ప్రస్తావనా లేదు. 2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని తెలిపారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత దేశం ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమని, అలాగే న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరమని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని, 'వికసిత్ భారత్ 2047' నినాదం.. 140 కోట్ల మంది ప్రజల కలల తీర్మానమని అన్నారు. ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నాయి. లక్ష్యం ఉండాల్సిందే. కానీ గత పదేళ్ల కాలంలో ప్రజల జీవన ప్రమాణాలు ఏ మాత్రం పెరిగింది..కొనుగోలు శక్తి పెరిగిందా లేదా అన్న చర్చ చేయడం లేదు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని, వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పు తెచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉత్తరాదిలో అతలాకుతలం చేసిన వరదలు, కొండచరియలు విరిగి పోవడం, మణిపూర్‌లో ఊచకోతలు, ధరల పెరుగుదల,నిరుద్యోగం, ఆర్థికమాంద్యం కోసం తీసుకునే చర్యల గురించి ప్రస్తావించ లేదు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ ఏటా మాట్లాడుతూ ప్రస్తావించిన అంశాలు ఏవీ అమలు కావడంలేదు. ఇప్పుడు కొత్తగా మరో 25 ఏళ్ల దార్శనికత గురించి చెబితే ప్రజలు నమ్ముతారా అన్నది ఆలోచించడం లేదు. ధరల పెరుగుదల, రూపాయి పతనం, నిరుద్యోగం, ఆర్థిక మాంద్యం ఇప్పుడు దేశాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటోందన్న ఆర్థిక నిపుణుల హెచ్చరికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక కావాలి. ప్రధాని మోడీ ఈ విషయాలపై ఎక్కడా మాట్లాడడం లేదు. ఎర్రకోట ప్రసంగంలోనూ వీటి గురించి ప్రస్తావించలేదు. వీటిని ఎలా అధిగమించ బోతున్నారో కూడా చెప్పడంలేదు. గతంలో చెప్పిన వాగ్దానాలేవీ అమలుకాలేదు. తన ప్రభుత్వం సాధించిన విజయాలను,చేపట్టిన సంక్షేమ పథకాలను, సంస్కరణలను ఎంతగొప్పగా చెప్పినా పొయ్యిలో పిల్లి లేవని కుటుంబాలు కోకొల్లలు. ఇన్ని చెప్పిన ప్రధాని మోడీ మన రూపాయికి శస్త్రచికిత్స చేసే విషయాన్ని మరచి పోయారు. రూపాయి రోజురోజుకూ చిక్కి శల్యమవుతున్నా ప్రస్తావించడంలేదు. రూపాయి విలువ పెరగ లేదు సరికదా మరింత దిగజారుతున్నా పట్టుకుని నిలపాలన్న తపన కానరావడం లేదు. కనీసం దానిని తాను అధికారం చేపట్టిన నాటి స్థాయికి తీసుకుని వద్దామన్న ప్రయత్నం కూడా చేయడం లేదు. ఈ మాంద్యాన్ని గమనించి అడుగులు వేద్దామన్న చిత్తశుద్ధి కానరావడం లేదు.అందుకే మోడీ ఎర్రకోట ప్రసంగం పై ఎక్కడా ఆసక్తి గానీ, ఆయన పిలుపుపై స్పందన గానీ కానరావడం లేదు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు, విదేశాల నుంచి నల్లధనాన్ని వెనక్కి రప్పించడం వంటి తొలినాళ్ల హామీలను ఇప్పుడు ఎక్కడా ప్రస్తావించడం లేదు. దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నిరుద్యోగంపైనా ప్రధాని పెదవి విప్పడంలేదు. ఇలా సమస్యలు వెన్నాడుతున్నా.. ప్రజలను పట్టించుకోకుండా మరోమారు ఓటేశారు. ఓ రకంగా సుతిమెత్తగా హెచ్చరించారు. సీట్ల సంఖ్య తగ్గించి తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. అయినా ఆయన ఆలోచన ధోరణి మారడం లేదు. వంచనలతో పాలన చేయలేమని మోడీతో పాటు,రాష్ట్రాల సిఎంలు కూడా గుర్తించాలి. నిరుద్యోగం,ద్రవ్యోల్బణం, జీఎస్టీలతో నిలువుదోపిడి చేస్తున్న తీరుపై స్పష్టత లేకుండా ఎంతకాలం మోసం చేస్తారు. అచ్ఛేదిన్ వాగ్దానం చేసి మరచిపోతే ఎలా అన్నది మోడీ గుర్తు చేసుకోవాలి. పాలకులు తాముచేసిన వాగ్దానాలపై కసరత్తు చేయకుండా మరింతగా ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎలా అన్నది మననం చేసుకోవాలి. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్.. అమృత్ కాల్, ఆజాదీకా అమృత్ మహోత్సవం ఇలా నినాదాలతో ప్రజల కడపులు నిండవని గుర్తించాలి. అందుకేనేమో కొత్తగా వికసిత భారత్ లక్ష్యాన్ని ప్రకటించారు. 2047 నాటికి వికసిత భారత్ కావాలన్న ఆకాంక్షను తెలియ చేశారు. ఇలా ప్రకటనలతో ప్రజలను మభ్య పెట్టడం వల్ల దేశం పురోగమించదని గుర్తించడం లేదు. అవరోధాలను, అవకాశాలను పారదర్శకంగా చర్చించి, భవిష్యత్ మార్గాన్ని సూచించడం విజ్ఞత అవుతుంది. కానీ సమస్యలను ముందు పెట్టుకుని వాటిని లేనట్లుగా చూపడం మోసం అవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి గతంలో ఓమారు దిగజారిన వేళ అప్పట్లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన పివి నరసింహారావు నడుం బిగించి చక్కదిద్ది, ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పడిపోతున్న రూపాయిని పట్టుకుని లేపారు. విదేశీమారక నిల్వలను నిలబెట్టారు. ఇప్పుడలాంటి చొరవ కానీ, దక్షత కానీ పాలకులుకు లేకుండా పోయింది. అనుత్పాదక రంగాలకు నిధులను వేలం వెర్రిగా ఖర్చు చేస్తూ పోవడం, దిగుమతులు పెంచడం వంటి చర్యలు దేశీయంగా ఆర్థికరంగాన్ని దెబ్బతీస్తూ వస్తోంది. ఉచిత పథకాలకు మంగళం పాడాల్సింది పోయి వాటిని పెంచుతున్నారు. ఈ విషయంలో రాష్ట్రాలు విచ్చలవిడిగా నిధులను దుర్వినియోగం చేస్తున్నాయి. దీనిని అర్థం చేసుకోని పాలకుల కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటోంది. ఇలాగే ఏపి, తెలంగాణలు దారుణంగా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయాయి. అయినా ఉచిత పథకాలను మానడం లేదు. పన్నులు వేయడం లేదంటూనే పరోక్షంగా పన్నులు వసూళ్లు చేస్తున్నారు. తాజాగా మరోమారు ఇలాంటి భయాలు వస్తున్న వేళ కేంద్రం దిద్దుబాటు చర్యలు పూనుకోకుండా నినాదాలకే పరిమితం కావడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం కాక మరోటి కాదు. ప్రజలు, పరిశ్రమలు, ప్రభుత్వం ఎక్కువ మొత్తాలను పొదుపు చేసి, ఆ నిధులను పెట్టుబడులుగా ఉపయోగించి, వస్తుసేవల ఉత్పత్తినీ, ఎగుమతులనూ వృద్ధి చేసినప్పుడు మాత్రమే స్థిరమైన ప్రగతిని సాధించగలం. దిగుమతులను తగ్గిస్తూ పోతూ, ఎగుమతలుపై దృష్టి పెట్టాలి. అనవసర వస్తువులను అదేపనిగా దిగుమతి చేసుకోవడం తగ్గించాలి. ఇబ్బడిముబ్బడిగా ప్రపంచ మార్కెట్ మనపై పెత్తనం చేయకుండా చూసుకోవాలి. ఇవన్నీ మరచి ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతూ పోతే ఎంతకాలం అయినా భారత్ పురోగతి సాధించదు. నిజానికి చిత్తశుద్ధితో సమస్య పరిష్కారినిక కృషి చేసివుంటే ఈ దశాబ్ద కాలంలో ఎంతో ప్రగతి సాధించేవాళ్లం. ఇప్పటికైనా ప్రజలు కళ్లు తెరవాలి. పాలకుల కళ్లు తెరిపించేలా చేయాలి.

# ఆ 16 మంది ఐపీఎస్‌లపై చంద్రబాబు ప్రభుత్వానికి ఎందుకంత కోపం?




అమరావతి,ఐపీసీ బదులు వైసీపీ చట్టాన్ని అమలు చేశారని ఆరోపణలు ఎదుర్కొన్న 16 మంది ఐపీఎస్‌లకు ప్రభుత్వం వెరైటీ శిక్ష విధించింది. ఇప్పటికే పోస్టింగ్‌లు ఇవ్వకుండా వెయిటింగ్‌లో పెట్టిన ప్రభుత్వం%ొ% సీనియర్ అధికారులను ఖాళీగా వదిలేస్తే ఎలా అని అనుకుందేమో%ొ% ఇంతవరకు రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనట్లు ఓ మెమో జారీ చేసింది. ప్రస్తుతం ఎంతో మంది అధికారులు వెయిటింగ్‌లో ఉన్నప్పటికీ ప్రత్యేకంగా ఓ 16 మందిని గుర్తించి రోజూ రమ్మని పిలవడమే హాట్‌టాపిక్ అవుతోంది. ఇంతకీ ఈ 16 మందిపై ప్రభుత్వానికి ఎందుకంత కోపం? రోజూ వారిని డీజీపీ ఆఫీసుకు రమ్మని పిలవడం వెనుక రీజనేంటి?

ఆ 16మందికి.. ఏ పనీ లేకుండా ఖాళీగా ఉంచడమే శిక్ష..

రాష్ట్రంలో 16 మంది ఐపీఎస్ అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలకు రంగం సిద్ధం చేస్తోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్‌లో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోస్టింగ్‌లు ఇవ్వకుండా పక్కన పెట్టిన ఆ 16 మందిని ఖాళీగా ఉంచకుండా వెరైటీగా శిక్షించాలని భావిస్తోంది. వెయిటింగ్‌లో ఉన్నామని ఇళ్లల్లో రెస్ట్ తీసుకోకుండా రోజూ డీజీపీ ఆఫీసుకు వచ్చి వెళ్లాలని మెమో జారీ చేసింది. ఇలా ప్రత్యేకంగా 16 మంది అధికారుల పేర్లు సూచిస్తూ వారు రోజూ డీజీపీ ఆఫీసుకు రావాలని%ొ% కచ్చితంగా సాయంత్రం 5 గంటల వరకు డీజీపీ ఆఫీసులోనే అందుబాటులో ఉండాలని ఆదేశించడమే చర్చనీయాంశమవుతోంది. 16 మంది ఐపీఎస్‌లకు ఏ పనీ లేకుండా ఖాళీగా ఉంచడమే శిక్ష అన్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమే పోలీస్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది.

ఐబీ చీఫ్‌గా ఉండగా టీడీపీ నేతలను వేధించారనే ఆరోపణలు..

గత ప్రభుత్వంలో హద్దులు మీరి ప్రవర్తించడంతోనే 16 మంది ఐపీఎస్‌లకు వెరైటీ శిక్ష విధించినట్లు అమరావతిలో టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా గత సర్కార్‌లో ఇంటిలిజెన్స్ చీఫ్‌గా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులుపై సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడానికి రెండు రోజుల ముందే వేటు పడింది. ఈయన ఐబీ చీఫ్‌గా ఉండగా టీడీపీ నేతలను వేధించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆంజనేయులుకు గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఆయనను కలిసేందుకు కూడా సీఎం చంద్రబాబు అంగీకరించకపోవడంతో ఆంజనేయులు వీఆర్ఎస్‌కు ప్రయత్నించారనే టాక్ వచ్చింది. ఇప్పుడు ఆయనను రోజూ రమ్మని పిలవడం సీనియర్ ఐపీఎస్‌కు అవమానకరమైన అంశమే అంటున్నారు.

చంద్రబాబు అరెస్ట్ సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించారని సీరియస్..

ఇక డీజీపీ హోదాలో ఉన్న పీవీ సునీల్‌కుమార్, ఏడీజీపీ హోదాలో ఉన్న ఎన్.సంజయ్ వంటి సీనియర్లు సైతం ప్రభుత్వం హిట్‌లిస్టులో ఉన్నారు. వీరు ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్నప్పటికీ ఖాళీగా కూర్చోకుండా ఆఫీసుకు రావాలని సూచించడం ద్వారా వారి పట్ల ప్రభుత్వ వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేసినట్లైంది. వీరిలో సునీల్‌కుమార్ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్‌కు గురిచేశారనే ఆరోపణలు ఎదుర్కొంటుండగా, చంద్రబాబు అరెస్టు సమయంలో అత్యుత్సాహం ప్రదర్శించారని సంజయ్‌పై ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది. అవరసరం లేకపోయినా చంద్రబాబు అరెస్టుపై హైదరాబాద్, ఢిల్లీ వెళ్లి మీడియా సమావేశాలు నిర్వహించడమే సంజయ్‌కు అశనిపాతమైందంటున్నారు.

గత ప్రభుత్వానికి మేలు చేశారనే ఆరోపణలు..

ఇక మిగిలిన ఐపీఎస్‌లు కూడా ఏదో ఒక విధంగా గత ప్రభుత్వానికి మేలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారే. ఎస్పీలుగా పని చేసిన రిషాంత్‌రెడ్డి, అన్బురాజన్, రఘువీరారెడ్డి, పరమేశ్వరరెడ్డి, జాషువా, కృష్ణకాంత్ పాటిల్‌పైనా ప్రభుత్వం సీరియస్‌గానే ఉంది. వీరెవరికీ సమీపంలో పోస్టింగులు ఇచ్చే పరిస్థితి లేదని ప్రచారం జరుగుతోంది. వీరంతా గత ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు చేయడమే కాకుండా, టీడీపీ నేతలను ఇబ్బంది పెట్టారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా అందరినీ పక్కన పెట్టడమే కాకుండా%ొ% రోజూ డీజీపీ ఆఫీసుకు రావాల్సిందిగా సూచించింది.

కేసులను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అనుమానం..

ఇలా గత ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన పోలీసు అధికారులు ఇప్పుడు ప్రభుత్వానికి టార్గెట్‌గా మారారనేది స్పష్టమవుతోందంటున్నారు. ఐతే వీరికి పోస్టుంగులు లేకుండా పక్కన పెట్టినా, గతంలో ఎన్నడూ లేనట్లు రోజూ ఆఫీసుకు రమ్మని పిలవడానికి ఇంకో ముఖ్య కారణం ఉందంటున్నారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మద్యం, ఇసుక, గనులు, ఎర్రచందనం, బియ్యం అక్రమ రవాణా వంటి వాటిపై ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్‌పైనా కేసులు నమోదయ్యాయి. ఈ పరిస్థితుల్లో వైసీపీకి అనుకూలంగా ఉన్న అధికారులు బయట ఉంటే ఆయా కేసులను ప్రభావితం చేసే అవకాశం ఉందనే అనుమానంతో అందరినీ డీజీపీ ఆఫీసుకు పిలిపించినట్లు చెబుతున్నారు. మొత్తానికి ఐపీసీ చట్టం బదులు వైసీపీ చట్టాన్ని అమలు చేశారని టీడీపీ ఆరోపించిన పోలీసు అధికారులకు వెరైటీ శిక్ష విధించడంపై విస్తృత చర్చ జరుగుతోంది.

## కొడుకుపై తప్పుడు కేసులు

మంగళగిరి,మంగళగిరిలో మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసు విచారణ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత స్పీకర్ అయ్యన్న పాత్రుడు అప్పటి సీఎం జగన్ పై అసభ్య పదజాలంతో తిట్టారు.. అందుకే నేను చంద్రబాబు దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయాలని వెళ్లాను..

# దళిత మహిళకు బషీరాబాద్ ఎస్ఐ బెదిరింపులు

వికారాబాద్ ,వికారాబాద్ జిల్లా పరిధిలోని బషీరాబాద్‌లో షాద్‌నగర్ తరహా ఉదంతం చోటు చేసుకుంది. విచారణ పేరుతో దళిత మహిళకు బషీరాబాద్ ఎస్ఐ రమేశ్ కుమార్ చిత్రహింసలు పెడుతున్నాడు. కుమారుడి ఆచూకీ చెప్పకపోతే తుపాకీతో కాల్చి చంపేస్తా అంటూ దళిత మహిళను ఎస్ఐ బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ప్రేమించిన అమ్మాయితో కొడుకు వెళ్లిపోగా, అతని తల్లి కళావతిని మూడు నెలలుగా ఎస్ఐ రమేశ్ కుమార్ చిత్రహింసలు పెడుతున్నాడు. విచారణ పేరిట పోలీస్ స్టేషన్‌కు పిలిచి కాళ్లు, చేతులు వాచేలా ఎస్ఐ రమేశ్ కుమార్ లాఠీతో కొట్టారని దళిత మహిళ కళావతి ఆరోపించింది. ఈ క్రమంలో ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల ఆందోళనకు దిగాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవల్గా గ్రామానికి చెందిన లోహడ నరేష్(17), కాశీంపూర్ గ్రామానికి చెందిన బాలిక(16) ప్రేమించుకొని 3 నెలల క్రితం ఇంట్లో నుండి వెళ్ళిపోయారు. అయితే బాలికను నరేష్ కిడ్నాప్ చేశాడని బాలిక కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నరేష్ తల్లిని బషీరాబాద్ స్టేషన్‌కు పిలిచి కొడుకు అడ్రస్ చెప్పాలని కాళ్లు, చేతులు వాచిపోయేలా లాఠీ దెబ్బలు కొట్టారు. నరేష్ దొరికే వరకు అతని తల్లి కళావతి రోజు పోలీస్ స్టేషన్‌కు రావాలని చెప్పడం, పోలీస్ స్టేషన్‌కు వచ్చాక ఆమెను కొట్టడం, బయట కూర్చోబెట్టడం చేస్తున్నారు.

# వైసీపీ నేత అవినాష్‌కు బిగ్ షాక్..

అమరావతి,వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్‌కు బిగ్ షాక్ తగిలింది. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. గురువారం రాత్రి హైదరాబాద్ నుంచి దుబాయ్ వెళ్లేందుకు ప్రయత్నించగా..శంషాబాద్ విమానాశ్రయం అధికారులు మంగళగిరి పోలీసులకు సమాచారం అందించారు.అవినాష్‌పై కేసులు ఉన్నందున ప్రయాణానికి అనుమతి ఇవ్వొద్దని పోలీసులు కోరారు. ఇమ్మిగ్రేషన్ సమయంలో అవినాష్‌పై లుకౌట్ నోటీసులు ఉండటంలో అప్రమత్తమైన పోలీసులు అవినాష్ దుబాయ్ ప్రయాణాన్ని అడ్డుకున్నారు. దీంతో చేసేది ఏమిలేక అవినాష్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి వెనక్కి వెళ్లిపోయారు. కాగా, టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడితోపాటు టీడీపీ నాయకుడు పట్టాభి ఇంటిపై జరిగిన దాడి ఘటనల్లో దేవినేని అవినాష్‌పై కేసులు నమోదయ్యాయి. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో అవినాష్ నిందితుడిగా ఉన్నారు. అంతకుముందు మూడేళ్ల క్రితం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. ఈ దాడి వెనుక అవినాష్ హస్తం ఉందనే ఆరోపణలు వినిపించాయి. ఇందులో భాగంగానే ఆయనపై పలు కేసు నమోదయ్యాయి. దేవినేని అవినాష్ దుబాయ్ పారిపోయేందుకు ప్రయత్నం చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా, అంతకుముందు 2019 ఎన్నికల్లో గుడివాడ నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత వైసీపీలో చేరారు. గత ఎన్నికల్లో వైసీపీ తరఫున దేవినేని అవినాష్ విజయవాడ ఈస్ట్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. వైసీపీ హయాంలో టీడీపీ నేతలపై దూకుడుగా వ్యవహరించిన ఆయన టీడీపీ కార్యాలయాలపై దాడిలో ప్రధాన పాత్ర పోషించారనే అనుమానాలు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, శంషాబాద్ విమానాశ్రయంలో దేవినేని అవినాష్ విదేశీ పర్యటనను అడ్డుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రయాణానికి అనుమతి ఇవ్వొద్దని మంగళగిరి పోలీసులు శంషాబాద్ పోలీసులకు సూచించారు. అనుమతి నిరాకరించడంతో అవినాష్ వెనుదిరిగారు.

## రాఖీ నారా లోకేష్ కేనా ?

అమరావతి,వైఎస్ షర్మిలలో ఇంతటి మార్పుని వైసీపీ అభిమానులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఆమెకు అన్న జగన్ కి మధ్య ఆస్తి తగాదాలు ఉండవచ్చు. అంతే కాదు ఆమె 2012 నుంచి 2019 దాకా వైసీపీ కోసం పడిన కష్టానికి అన్న నుంచి తగిన ప్రతిఫలం దక్కకపోవచ్చు. కానీ ఆమె అంతకు వేయింతలు అన్నట్లుగా ఏకంగా తండ్రి పేరిట ఏర్పాటు అయిన వైసీపీనే కూల్చేందుకు జగన్ కి రాజకీయ జీవితమే లేకుండా చేసేందుకు సాగిస్తున్న రాజకీయాన్ని చూసి వైసీపీ అభిమానులు తీవ్రంగా కలత చెందుతున్నారని ప్రచారం సాగుతోంది.ఉమ్మడి ఏపీ నుంచి రెండు పార్టీలు రెండు కుటుంబాలు అన్నట్లుగా వైఎస్సార్ నారా ఫ్యామిలీల మధ్య రాజకీయ యుద్ధం సాగుతోంది. ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాలదు అన్న మాదిరిగానే ఈ కథ సాగుతోంది. షర్మిల సైతం 2023 రెండో అర్ధ భాగం దాకా అలాగే ఉంటూ వచ్చారు. ఆమె వైసీపీలో ఉన్నపుడు నారా కుటుంబాన్ని ఎన్నెన్ని మాటలు అన్నారో కూడా అంతా చూశారు.ఇదే లోకేష్ ని పట్టుకుని 2019 ఎన్నికల వేళ అ ఆ లు రాని వారు అగ్రతాంబూలం తనకే కావాలని అన్నాడంట. అలా ఉంది లోకేష్ తీరు. ఆయనకు అయిదు శాఖలను చంద్రబాబు ఇచ్చారు అని విమర్శించారు. జాబు రావాలంటే బాబు రావాలని ఊదరగొట్టిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక తన కొడుక్కే అయిదు కీలక శాఖలతో మంత్రి పదవి ఇప్పించుకున్నారు అని సెటైర్లు పేల్చారు.చంద్రబాబుకు ఒక ముని శాపం ఉందని ఆయన నిజం చెబితే తల వేయి ముక్కలు అవుతుందని అందుకే ఎపుడూ అబద్ధమే చెబుతారు అని కూడా షర్మిల ఘాటైన విమర్శలు వైసీపీ మహిళా నేతగా చేశారు. సీన్ కట్ చేస్తే ఆమె తన కుమారుడి వివాహానికి ఆహ్వానించడానికి అని చంద్రబాబు ఇంటికి వెళ్లారు. ఆయనతో చాలా సేపు మాట్లాడారు.దాని కంటే ముందు తెలంగాణాలో పార్టీ పెడతామని ఒక ఎల్లో మీడియాకు ఇంటర్వ్యూ ఇస్తూ చెప్పారు ఇక గత ఏడాది డిసెంబర్ లో క్రిస్మస్ శుభాకాంక్షలు ఆమె లోకేష్ కి చెప్పారు. ఇలా నారా కుటుంబంతో ఆమె తన అనుబంధాన్ని పెంచుకోవడం చూసిన వైసీపీ నేతలు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు అని అంటున్నారు.అయితే రాజకీయాలు వేరు వ్యక్తిగతం వేరు అని షర్మిల ఎంత చెప్పినా ఏపీలో అలాంటి పరిస్థితులు లేవు అనే అంటారు. ఉంటే జగన్ ని పదహారు నెలలు బెయిల్ సైతం రాకుండా ఎలా జైలు గోడల మధ్యన ఉంచుతారు అని కూడా వైసీపీ నేతలు ప్రశ్నిస్తుంటారు. వైఎస్సార్ మరణానంతరం ఆ కుటుంబం రాజకీయాల్లో లేకుండా చేయడానికి టీడీపీ కాంగ్రెస్ తో చేతులు కలిపి జగన్ మీద కేసులు పెట్టించిన సంగతి మరచారా అని కూడా అడుగుతూ ఉంటారు.ఇవన్నీ ఇలా ఉంటే తాజాగా స్వాతంత్ర దినోత్సవ వేళ ఎట్ హెూం పార్టీకి షర్మిల కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో వెళ్లారు. అక్కడ మంత్రి హోదాలో నారా లోకేష్ ఉన్నారు. ఆయన షర్మిలను చూడగానే ఏమి తల్లీ బాగున్నావా అని ప్రశ్నించారు. దానికి బదులుగా షర్మిల బాగున్నా అన్నా అని బదులిచ్చారు. అంతే కాదు ఈ ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకోవడం కూడా జరిగింది.దీంతో ఈ ఇద్దరూ మాట్లాడుకుంటున్న వీడియో బైట్ ని సోషల్ మీడియాలో టీడీపీ వారు పెట్టి అన్నా చెల్లెళ్ళు అంటే వీరే అన్నటుగా

# మొక్కలు నాటి స్ఫూర్తిని నింపండి

నిజామాబాద్,రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నందున ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ కొనసాగుతుందని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఇప్పటికే నాటిన వారు వాటిని సంరక్షించాలని, కొత్తగా నాటనివారు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది మన పిల్లలకు అందించే బ్యాంక్ బ్యాలెన్స్ లాంటిదని గుర్తుంచు కోవాలన్నారు. పారిశుద్యం మనందరి బాధ్యత అని, ప్రజలు స్వచ్ఛతను పాటించాలని అన్నారు. అంటువ్యాధులు దూరంగా ఉండాలంటే ఇది తప్పదని అన్నారు. ప్రజలందరూ ముందుకు వచ్చి స్వచ్ఛందంగా తమ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. ఇంటి వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మొక్కలు నాటి పర్యవరణాన్ని పరిరక్షించుకొని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. గ్లోబల్ వార్మింగ్‌తో దేశ రాజధాని ఢిల్లీలో నివసిస్తున్న ప్రజలు నెలల తరబడి బయటకు వెళ్లని పరిస్థితులు నెలకొంటాయని రాబోయే కాలంలో రాష్ట్ర ప్రజలకు కూడా అదే పరిస్థితి రావద్దనే ఉద్దేశంతో మనమంతా బాధ్యతగా మెలగాలని అన్నారు. అటవీ సంపదను పెంపొందించడంలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంలో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. అడవులను నరకడం వల్లనే ఇవాళ అనేక అనర్థాలు వచ్చాయని అన్నారు. ఖాళీ స్థలాల్లో తప్పనిసరిగా మొక్కలు నాటాలని పోచారం పిలుపునిచ్చారు. అవసరమైనన్ని మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచిందని ఒక వేళ కొరత ఏర్పడితే ప్రత్యేక నిధులను కేటాయించి మొక్కలను కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. అధికంగా మొక్కలు నాటి పర్యావరణంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలన్నారు. వంద శాతం మొక్కలను నాటి త్వరగా జిల్లాను మొదటి స్థానంలోకి తీసుకురావాలన్నారు. మహనీయుల పేరిట మొక్కలు నాటించాలన్నారు. పుట్టిన రోజు, పెళ్లి రోజులు, స్మారక దినోత్సవాలు, జయంతులు, వర్ధంతులు, మహనీయుల పేర్లతో మొక్కలు నాటితే విద్యార్థుల జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. అధికారులు బాధ్యతగా పని చేస్తేనే అది విజయవంతం అవుతుందన్నారు.

## మంకీఫాక్స్ అంటువ్యాధి

న్యూఢిల్లీ,కరోనా కంటే మంకీఫాక్స్ డేంజర్,ఇది అంటువ్యాధి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ ఎమర్జెన్సీగా ప్రకటన జారీ చేయడంతో హైదరాబాద్ నగరంలో అలర్ట్ ప్రకటించారు. ఆఫ్రికా దేశ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఉన్న నేపథ్యంలో అప్రమత్తత ప్రకటించారు.ఆఫ్రికా దేశంలో ఇప్పటికే 17,500 మంకీ ఫాక్స్ కేసులు నమోదయ్యాయి.ఈ మహమ్మారి వల్ల 460 మంది మరణించారు. ఇది అంటువ్యాధి కావడంతో ఆఫ్రికన్ విద్యార్థులు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఉన్నందున డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. ఆఫ్రికాలో మంకీపాక్స్ వైరస్ కేసులు పెరుగుతుండటంతో ఆఫ్రికన్ యూనియన్ హెల్త్ వాచ్‌డాగ్ ప్రజారోగ్యశాఖ అత్యవసర పరిస్థితిని ప్రకటించింది.ఈ వైరస్ వ్యాప్తి పలు ఆఫ్రికన్ దేశాల్లో, డెమోక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వ్యాపిస్తుంది.మంకీపాక్స్‌ను కాంటినెంటల్ సెక్యూరిటీ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటిస్తున్నామని ఆఫ్రికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ అధిపతి జీన్ కసేయా చెప్పారు.-ఆఫ్రికన్ విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఎక్కువ మంది హైదరాబాద్ నగరానికి వచ్చి ఉన్నందున, ఈ అంటు వ్యాధి ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.ఉన్నత విద్య అభ్యసించే ఆఫ్రికన్ విద్యార్థులకు హైదరాబాద్ ప్రముఖ గమ్యస్థానంగా ఉంది.డబ్ల్యూహెచ్ఓ హెచ్చరికతో హైదరాబాద్ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆఫ్రికన్ విద్యార్థులపై వైద్యులు దృష్టి సారించారు. ఆఫ్రికాలో 2022వ సంవత్సరంలో మంకీఫాక్స్ వ్యాధిని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ గుర్తించింది.ఈ వైరస్ మశూచి వంటి లక్షణాలతో కూడిన వైరల్ జూనోటిక్ వ్యాధి అని తేలింది. ఈ వైరస్ మంకీపాక్స్ వైరస్ వల్ల సంభవిస్తుంది.ఈ వ్యాధిని మొదటిసారిగా 1958వసంవత్సరంలో కోతుల్లో కనుగొన్నారు. మొదటి మానవ కేసు 1970వ సంవత్సరంలో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో వెలుగుచూసింది. 2003వ సంవత్సరంలో ఆఫ్రికా వెలుపల మొట్టమొదటి మంకీపాక్స్ వ్యాప్తి అమెరికాలో వెలుగుచూసింది. మంకీఫాక్స్ వైరస్ గాలి ద్వారా సంక్రమించే కోవిడ్‌లా కాదు.ఈ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం, లైంగిక సంపర్కం లేదా గాయాలతో సన్నిహిత సంబంధం ద్వారా మాత్రవే వ్యాధి సోకుతుంది. మంకీఫాక్స్ లక్షణాలు:మంకీఫాక్స్ వైరస్ లక్షణాలు శోషరస గ్రంథుల వాపు, జ్వరం, తలనొప్పి, శరీర నొప్పులు, తీవ్ర బలహీనతలుంటాయి. జ్వరం వచ్చిన 1-3 రోజులకు చర్మంపై దద్దుర్లు మొదలవుతాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గురువారం మంకీపాక్స్‌ను అంతర్జాతీయ పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించడంతో, ప్రజలు ఈ వైరస్ ప్రమాద కారకాలు,ఎక్స్‌పోజర్‌ను తగ్గించే చర్యల గురించి తెలుసుకోవాల్సి ఉందని డాక్టర్లు చెబుతున్నారు.ఆఫ్రికా దేశం నుంచి హైదరాబాద్ కు విద్యార్థులు వచ్చినందున,మంకీఫాక్స్ వైరల్ ఇన్ఫెక్షన్ గురించి సాధారణ ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని హైదరాబాద్ నగరానికి చెందిన ఆశ్రిత ఆసుపత్రి డాక్టర్ రామ్మోహన్ రావు చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఆఫ్రికా విద్యార్థుల వల్ల మంకీఫాక్స్ వైరస్ ప్రబలినట్లు ఎలాంటి కేసులు రాలేదని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు 'ఫెడరల్ తెలంగాణ'కు చెప్పారు. ఈ వైరస్ గురించి హైదరాబాద్ లో ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని డాక్టర్ రాజారావు కోరారు. ఆఫ్రికన్ దేశాలకు చెందిన మంకీఫాక్స్ రోగుల ప్రయాణ చరిత్రను తప్పనిసరిగా ట్రాక్ చేయాలి.మంకీపాక్స్ వైరస్ సోకిన వ్యక్తులతో ప్రత్యక్ష పరిచయం ద్వారా వ్యాపిస్తుంది. గత 21 రోజుల్లో ఆఫ్రికా నుంచి హైదరాబాద్ వచ్చిన వారి ప్రయాణ చరిత్రను పరిశీలించాల్సి ఉంది.శరీరంపై తీవ్రమైన దద్దుర్లు ఉంటే,వారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి.

## నిండుకుండలా నాగార్జున సాగర్..

నల్లగొండ, నాగార్జున సాగర్ జలాశయానికి వరద పెరిగింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వరద పోటెత్తింది. ఎగువ కురిసిన వర్షాలకు కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలోని ప్రాజెక్టులకు వరద రాగా.. డ్యామ్ జలకళను సంతరించుకున్నది. ఇప్పటికే జలాశయం నిండకుండను తలపిస్తున్నది. దీంతో సాగర్‌లోని 4 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 79,528 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ ప్రస్తుత, పూర్తి నీటిమట్టం 590 అడుగులుగా ఉంది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 312 టీఎంసీలు. నాలుగు రోజుల కిందటి వరకు వరద ప్రవాహం రావడంతో 24 గేట్లు.. ఆ తర్వాత 18 గేట్లను ఎత్తి నీటి దిగువకు వదిలారు. రెండు రోజుల క్రితం వరద రావడంతో బుధవారం రెండు గేట్లను ఎత్తగా.. గురువారం వరద మరింత పెరిగింది. దాంతో ఆరు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. వరద మరింత పెరగడంతో ఇవాళ నాలుగు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో సాగర్‌కు క్యూ కట్టారు. వరుసగా సెలవులు రావడంతో సాగర్ వద్ద రద్దీ పెరిగే అవకాశం ఉన్నది.


# రూపాయికి శస్త్ర చికిత్స చేసేదెలా

ముంబై,రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం 2014 ఆగస్టు 14న డాలర్‌కు 61.05 పైసలు. ఈ పదేళ్లలో అది ఇప్పుడు రూ.83 నుంచి 84 మధ్యకి చేరుకుంది. ఇదొక్కటి చాలు మనమెంతగా ఆర్థికంగా చితికి పోయామో చెప్పడానికి. రూపాయి బలపడిందంటే మన ఎగుమతులు పెరిగాయని అర్థం చేసుకోవచ్చు. దీనివల్ల మన విదేశీ మారక నిల్వలు హరించుకు పోతున్నాయి. ఇదంతా కేవలం దిగుమతుల ప్రభావం అనడంలో ఎలాంటి సందేహం లేదు. మోడీ సాధించిన ఆర్థిక ప్రగతి ఎలా ఉన్నా రూపాయిని మాత్రం పట్టుకోలేకపోతున్నారు. నిజంగా రూపాయికి శస్త్రచికిత్స చేసే కార్యాక్రమాలు కానరావడం లేదు. మనవాళ్లను అమెరికా పంపించాలంటేనే భయం వెన్నాడుతోంది. చదువుకునేందుకు వెళ్లే పిల్లలకు రూపాయలను బస్తాల్లో పంపినా అక్కడ పిడికెడు డాలర్లు రావడం లేదని వాపోతున్నారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో ఎన్నడూ లేనంత కనిష్ట స్థాయికి దిగజారిపోయి రూపాయి విలపిస్తుండగా, నిత్యావ సరాల ధరలు పెరిగి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్న తీరు ఎక్కడా ప్రధాని మోడీ ప్రసంగంలో కానరావడం లేదు. 1947లో రూపాయి విలువ డాలర్‌తో సమానం. అంటే ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతావనిలో మనం బాగా అభివృద్ధి సాధించామని ఈ రకంగా పోల్చుకోవాలేమో. డాలర్‌తో రూపాయి మారకం దారుణంగా మారింది. అమెరికా, టర్కీల మధ్య తలెత్తిన విభేదాల నేపథ్యంలో టర్కీ కరెన్సీ అయిన లిరా ఒడిదుడుకుల కు గురికావడంతోనే ఇంతటి పెను మార్పులని అప్పట్లో ఆర్థికమంత్రిగా ఉన్న అరుణ్ జైట్లీ సెలవిచ్చారు. అంటే ప్రపంచంలో ఏ దేశంలో ఏ ఉపద్రవం వచ్చినా మన రూపాయి తట్టుకుని నిలబడేంత బలంగా లేదు. ఇంతటి బలహీనమైన రూపాయి ఎప్పుడు బలపడుతుందా అన్నదే అనుమానం. సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలు వచ్చాక ద్రవ్యమారక రేట్లతో ప్రజా జీవనం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన చమురు ధరలకు నిర్ణయాత్మకమవుతోంది. రూపాయి మారకం విలువ పడిపోతోందని 2014 ఎన్నికలకు ముందు మోడీ కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మోడీ వికసిత భారత్ ప్రకటించారు. అయితే రూపాయికి శస్త్రచికిత్స చేయకుండా దీనిని సాధించడం దుస్సాధ్యం. ఇది సాధిస్తే ప్రజలు ఎవరికి వారు ఆర్థికంగా ఎదగలరు. ఎవరి ఆరోగ్యం వారు చూసుకోగలరు. దివంగత ప్రధాని పివి నరసింహారావు మాత్రమే ఇలాంటి దార్శనికతను ప్రదర్శించారు. ఆయన తీసుకున్న సాహసోపేత సంస్కరణలే ఇప్పటికీ మనకు రక్షగా నిలిచాయి. ప్రధాని మోడీ ఇప్పుడు ఈ దిశగా దృష్టి సారించాలి. కఠిన పరిశ్రమ చేయాలి. పివి-మన్మోహన్ ద్వయం తెచ్చిన ఐఎంఎఫ్-ప్రపంచ బ్యాంకు ఆదేశిత ఆర్థిక విధానాలనే వాజ్‌పేయ్ ప్రభుత్వం అమలు చేసింది. అలాగే మన్మోహన్ సర్కారు బాటలోనే మోడీ ప్రభుత్వం నడుస్తోంది. కాబట్టి ఆ పార్టీలు పరస్పరం విమర్శించుకోవడం రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప నిజంగా మాత్రం కాదు. రిజర్వు బ్యాంకు రంగంలోకి దిగి రూపాయిని నిలబెట్టాల్సిఉందని చాలామంది సూచిస్తున్నారు. 80శాతం చమురు ఎలాగూ దిగుమతి చేసుకొనేదే కనుక, క్రూడాయిల్ ధర పెరిగి, దేశీయ మార్కెట్‌లో పెట్రో ఉత్పత్తుల రేట్లు మరింత హెచ్చి నిత్యావసర, వినియోగ వస్తువులు ఖరీదు కాక తప్పదు. ఉక్రెయిన్ యుద్ధంతో చమురు లభ్యత మరింత తగ్గి కొత్త కష్టాలు తెచ్చిపెట్టిందన్న ఆందోళనా ఉంది. ద్రవ్యోల్బణం అదుపు చేయడానికి ఆర్‌బిఐ కష్టాలు పడుతున్న తరుణంలోనే రూపాయి మరింతగా కృశించి పోతున్నది.



రూపాయిని కాపాడటానికి రిజర్వుబ్యాంకు వద్ద అనేక మార్గాలు ఉండివుంటాయని, తగిన సమయంలో నిర్ణయాలు చేస్తుందని ఆర్థిక నిపుణులు హామీ ఇస్తున్నప్పటికీ, ఈ దుస్థితి ఎంతకాలం కొనసాగుతుందన్నది అర్థంకాని ప్రశ్న. రిజర్వుబ్యాంకు చర్యలు సామాన్యుడికి ఉపశమనం ఇవ్వలేని కాలం కూడా దాపురించవచ్చు. రూపాయి బలహీనతలను గుర్తించి తగు శస్త్ర చికిత్సలకు దిగాలి. లేకుంటే ఆర్థిక ద్రవ్యోల్బణం,ధరల స్వారీ పెరగగలదు. పెద్దనోట్ల రద్దు వంటిచర్యల కారణంగానే ఆర్థిక సంక్షోభం ఉత్పన్న మైందన్న వాదన ఇప్పటికీ ఉంది. ఎందుకంటే ఆనాటి నుంచి నేటి వరకు ఆర్థికరంగం తిరోమనంలోనే ఉంది. తన అధికారాన్ని దుర్వినియోగ పరుస్తూ మోదీ ప్రభుత్వం రిజర్వుబ్యాంకును నోరులేని దానిగా మార్చి వేసిందని విపక్షాలు అంటున్నాయి. ఆర్థిక రంగంలో కొత్త ఉత్పాతాలను తట్టుకొని నిలబడగల స్థితిలో ప్రజలు లేరు. ద్రవ్యోల్బణం అదుపు తప్పితే మరిన్ని కష్టాలు తప్పవు. బ్యాంకు వడ్డీరేట్లు పెరగడం, రుణాలమీద ప్రభావం వంటి సమస్యలు కూడా అనేకం. రూపాయి పతనమవుతున్నందున పెట్టుబడిదారులు డాలర్ సురక్షితమైనదిగా భావించడంతో విదేశీ మారకద్రవ్య నిల్వలు కూడా తరిగి పోతున్నాయి. డాలర్ విలువ కారణంగా వాణిజ్యలోటు హెచ్చుతూ ఐదేళ్ళ గరిష్టానికి చేరింది. రూపాయి విలువ తగ్గుదలతో ఎగుమతులకు మేలు జరగవచ్చని కొందరంటున్నారు. అయితే ఇప్పటికే అమెరికా, ఐరోపా మార్కెట్లలో విధించిన నిబంధనలవల్ల వాటికి ముప్పు ఏర్పడిన వాస్తవాన్ని విస్మరించరాదు. అంతేగాక దిగుమతుల భారం వల్ల ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాన్ని గుర్తించాలి. డాలర్లు మన దేశం నుంచి తరలి పోకుండా పరిమితం చేయడానికి విలాస వస్తువుల విచ్చలవిడి దిగుమతులపై ఆంక్షలు విధించడం అవసరం అన్న భావనా ఉంది. దేశ ప్రజల కొనుగోలు శక్తిని పెంచే ఆర్థిక విధానాల వైపు ఇప్పటికైనా మళ్లాల్సి ఉంది.భారతీయ రిజర్వుబ్యాంకు జోక్యం పూర్తిస్థాయిలో లేనందునే రూపాయి ఇంతగా ఉన్నదని కొందరి వాదన. రూపాయి పతనం ఐటీ, ఎగుమతులు ఇత్యాది రంగాలకు మేలుచేస్తుందని అంటున్నారు కానీ, సామాన్యుడిపై ధరాఘాతం తప్పడం లేదు. దిగుమతి చేసుకొనే ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నాయి. ఎగుమతులు, దిగుమతులను విశ్లేషించాలి. తాము తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితం ఇవ్వడం లేదని గుర్తించి అందుకు కారణాలు విశ్లేషించాలి. చమురు దిగుమతులే మన కొంప ముంచుతు న్నాయని ఆర్థికవేత్తలతో సహా ప్రభుత్వాలు కూడా అంటున్నాయి. విపరీతంగా పెరిగిన చమురు ధరల కారణంగా మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు కరగి పోతున్నాయి. అంతేగాకుండా రూపాయి మారకవిలువ దిగజారిపోతోందని అంటున్నారు.

# ఏపీలో మరో 99 అన్న క్యాంటీన్లు ప్రారంభం



తాడేపల్లి, గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడా రు. చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. రెడ్ బుక్ విషయంలో ఊరూరూ వెళ్లి మాట్లాడనని వివరించారు. దీనిపై ప్రజలకు తాను హామీ ఇచ్చానన్నా రు. దానికి కట్టుబడి ఉన్నానని తెలియజేశారు. అందుకే ఎన్నికల్లో ప్రజలు మాకు మంచి తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. పనిలోపనిగా గత ప్రభుత్వం చేసిన కొన్ని అంశాలపై యాక్షన్ తప్పదన్నారు. ముఖ్యంగా లిక్కర్, ఇసుక దందాలు కొనసాగాయని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి జోగి రమేష్ కొడుకు వ్యవహారం గురించి కీలక విషయాలు వెల్లడించారు మంత్రి. అగ్రిగోల్డ్ భూమి పత్రాలు తీసుకుని, ఫేక్ పత్రాలు క్రియేట్ చేసి.. ఆయా భూములను సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత వాటిని అమ్మేశాడన్నారు. ఇలాంటి వాటిపై యాక్షన్ తీసుకోకూడదా? అంటూ ప్రశ్నించారు. ఇంకా లిక్కర్, ఇసుక దందాలపై చర్యలు తప్పవంటూ సంకేతాలు ఇచ్చేశారు.ఒక అబద్దాన్ని పదేపదే చెబితే నిజం అవుతుందని జగన్ భావిస్తున్నారని అన్నారు మంత్రి నారా లోకేష్. అందుకే ఫేక్ జగన్ అని పేరు పెట్టామన్నారు. చివరకు అన్న క్యాంటీన్ల నిర్వహణకు వచ్చే విరాళాలపైనా ఆ పార్టీ ఏడుస్తోందని దుయ్యబట్టారు. సైకోల బారి నుంచి పేదలని రక్షించడానికే విరాళాలు సేకరిస్తున్నట్లు తెలియజేశారు. మొత్తానికి జగన్ చేసిన కామెంట్స్‌కు ఫుల్ స్టాప్ పెట్టారు మంత్రి నారా లోకేష్. కాగా మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్.. అందులో ఏముంది? జగన్ ఎందుకు భయపడు తున్నారు? పదేపదే జగన్ ఆ విషయాన్ని ఎందుకు ప్రస్తావిస్తున్నారు? ఏదో విధంగా అధికార ప్రభుత్వంపై బురద జల్లడానికేనా? టీడీపీ ఎందుకు సైలెంట్‌గా ఉంటోంది? ఆయా ప్రశ్నలకు సమాధానం బయటకు వచ్చేసింది. వైసీపీ అధినేత జగన్ మీడియా ముందుకొచ్చిన ప్రతీసారీ రెడ్ బుక్ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తున్నా రు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని పదేపదే దుయ్యబడుతున్నారు. ఈ వ్యవహారంపై టీడీపీ నుంచి పెద్దగా కౌంటర్లు లేకపోవడంతో నేరుగా మంత్రి నారా లోకేష్ రంగంలోకి దిగేశారు. ఈ విషయంలో వైసీపీ లేవనెత్తిన ప్రశ్నలకు తనదైనశైలిలో రిప్లై ఇచ్చేశారాయన. శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని నులకపేట ప్రాంతంలో అన్న క్యాంటీన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఆయన స్వయంగా పలువురికి అల్పాహారం వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడా రు.

చట్టాన్ని ఉల్లంఘించి ప్రజలను, కార్యకర్తలను ఇబ్బందిపెట్టిన వారిని వదిలేది లేదని ప్రచారంలో చెప్పానన్నారు. ఏపీలో అన్న క్యాంటీన్లు తిరిగి పున:ప్రారంభమవుతున్నాయి. గురువారం సీఎం చంద్రబాబు గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించగా.. శుక్రవారం రాష్ట్రంలో మరో 99 అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ఇప్పటికే పలు జిల్లాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ప్రారంభిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో మండలానికో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ అన్న క్యాంటీన్లను ట్రస్ట్ ద్వారా శాశ్వతంగా నసాగించనున్నట్లు ప్రకటించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని మొదట భావించినప్పటికీ భవన నిర్మాణ పనులు పూర్తికానందున విడతలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక, గుంటూరు జిల్లా తాడేపల్లి మండంలోని నులకపేటలో శుక్రవారం ఉదయం మంత్రి నారా లోకేశ్ అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. అనంతరం అల్పాహారం వడ్డించారు. ఒంగోలులో అన్న క్యాంటీన్ ను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ఎమ్మెల్యే విజయ్ కుమార్ ప్రారంభించారు. కుప్పంలో అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో అన్న క్యాంటీన్ ను ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. పేదలకు అవసరమైన ప్రదేశాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 99 క్యాంటీన్లు ప్రారంభిచామన్నారు. ఒక్కో వ్యక్తికి రోజూ రూ.90 ఖర్చు చేస్తున్నామని, ఇందులో ప్రభుత్వం రూ.75 భరిస్తుందన్నారు. దాతల నిధులతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి అన్న క్యాంటీన్లను నిరంతరం కొనసాగిస్తామని మంత్రి వెల్లడించారు. అన్న క్యాంటీన్లలో రూ.5కే అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం అందించనున్నారు. ఇక, ఈ క్యాంటీన్ల నిర్వహణకు రోజుకు రూ.53 లక్షల ఖర్చు అవుతుందని ప్రభుత్వం పేర్కొంది. అల్పాహారానికి రూ.22, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి కలిపి రూ.68 ఖర్చు అవుతుండగా.. ఒక్కరోజు ఒక్కరికి మొత్తం రూ.90 వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వం వెల్లడించింది. ఒక్కరోజు ఒక్కరు మూడు పూటలకు కలిపి రూ.15 చెల్లిస్తే.. మిగతా డబ్బును రూ.75ను ప్రభుత్వం, దాతలు ఖర్చు చెల్లించనున్నారు. ఈ క్యాంటీన్లలో మూడు పూటలు కలిపి ఒక్కరోజు 1.05 లక్షల మంది పేదలకు ఆహారం సరఫరా చేయనున్నారు. ఉదయం 35వేల మందికి అల్పాహారం, మధ్యాహ్నం 35 వేలు. రాత్రి మరో 35 వేల మందికి భోజనం అందించనున్నారు. అన్న క్యాంటీన్లలో పేదలు, పనికోసం బయటకి వచ్చిన వారు రూ.15 చెల్లించి మూడు పూటలు కడుపునిండా తినవచ్చని తెలిపింది. తొలి విడతలో ప్రభుత్వం 100 క్యాంటీన్లను ప్రారంభించింది. అన్న క్యాంటీన్ల పున: ప్రారంభం సంతోషకర విషయమని, అయితే వీటిని ఆస్పత్రుల వద్ద ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని చూడటానికి వచ్చేవారు, లేదా కుటుంబ సభ్యులు రోజులో ఒక్కపూట భోజనం చేసేందుకు కనీసం రూ.50 నుంచి రూ.80 వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ అన్న క్యాంటీన్లను ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేస్తే.. రూ.15కే మూడు పూటలు తినేందుకు అవకాశం ఉంటుందన్నారు.

# కొండెక్కిన పూల ధరలు

హైదరాబాద్,శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. ప్రతి ఇంట్లో పూజలు, నోములు, వ్రతాలు శుభకార్యాలతో మార్మోగుతాయి. ఈ శ్రావణంలో ప్రతిరోజూ పూజా కార్యక్రమాలతో పాటు పలు శుభకార్యాలు.. వివాహ ముహూర్తాలు, గృహప్రవేశాలు, నిశ్చితార్థాలు, నూతన వ్యాపార ప్రారంభోత్సవం.. శ్రావణమాసంలో లేదా కార్తీక మాసంలో ఎన్నో శుభకార్యాలు జరుగుతాయి. పువ్వుల ధరలు ఆ స్థాయిలో పెరిగాయి కాబట్టి ఎక్కువ పూల పరిమళాలు వెదజల్లే ఇల్లు ధనవంతుడిలా ఉంటుంది. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని నగరంలోని పూల మార్కెట్లు కిటకిటలాడాయి. నగరవాసులు తెల్లవారుజాము నుంచే పూల కోసం మార్కెట్లకు పోటెత్తారు. బంతి, చామంతి, కనకాంబర, తామరపూలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఒక జత రూ.30కి లభించే కమలాలు నేడు దాదాపు రూ.100కి చేరాయి. గత నెల మల్లెలు కిలో రూ.550 ఉండగా ప్రస్తుతం రూ.1500 పలుకుతోంది. తెల్ల చామంతి రూ.200 నుంచి రూ.350, కనకాంబరం రూ.100 నుంచి రూ.300, పసుపు చామంతి రూ.150 నుంచి రూ.400, కలువ రూ.150 నుంచి రూ.500, జాజులు రూ.300 నుంచి రూ. .1,200 పలుకుతుండటంతో శ్రావణ మాసం కావడంతో ప్రజలకు తిప్పలు తప్పడంలేదు. మరోవైపు అమ్మవారికి పూల మాలలకు గిరాకీ ఎక్కువైంది. పూజలో ఉపయోగించే దండలను మరింత అందంగా తీర్చిదిద్ది మార్కెట్ లో అందుబాటులో ఉంచారు. అరటి కొమ్మలు, తమలపాకులు, అలంకరణకు ఉపయోగించే అన్ని రకాల పూలను కొనుగోలు చేసేందుకు నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అయితే సామాన్య ప్రజలు ఏ పువ్వుల ధరలు చూసిన అమ్మో.. అనే పరిస్థితి ఏర్పడింది.

## పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు

అమరావతి,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో సమావేశం అయ్యారు టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్.. పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రణాళికలు అందించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం.. దేశంలో పేరున్న పారిశ్రామిక వేత్తలు, ఆయా రంగాల నిపుణులతో టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు కానుంది.. సీఎం చంద్రబాబు చైర్మన్‌గా, టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కో-చైర్మన్‌గా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయనున్నారు.. పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై ఈ టాస్క్ ఫోర్స్ పనిచేయనుంది.. ఇక, అమరావతిలో సీఐఐ భాగస్వామ్యంతో స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ సంస్థ ఏర్పాటుకు నిర్ణయం.ఈ సంస్థ ఏర్పాటులో భాగస్వామికానుంది టాటా గ్రూప్. రాష్ట్రంలో పెట్టుబడుల అంశంపై టాటా గ్రూప్ ఛైర్మన్‌తో చర్చలు జరిపారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్- విజన్ 2047 రూపకల్పన అంశాలపై సమావేశంలో చర్చకు వచ్చాయి.. 2047 నాటికి ఏపీని నంబర్ వన్ ప్లేస్‌లో నిలపడమే లక్ష్యంగా చర్చించినట్టుగా తెలుస్తోంది.. ఇక, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. మేధావులు, పరిశ్రమల ప్రముఖులు సభ్యులుగా స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ఏ 2047 ఆర్థికాభివృద్ధి కోసం టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నాం అన్నారు.. చంద్రశేఖరన్ ఈ టాస్క్‌ఫోర్స్‌కు కో-ఛైర్‌గా ఉంటారని ప్రకటించడానికి నేను సంతోషిస్తున్నాను అన్నారు.. ఎయిర్ ఇండియా, విస్తారాతో ఎయిర్ కనెక్టివిటీని మెరుగుపరచే అంశంపై చంద్రశేఖరన్ తో చర్చించాం. వివిధ రంగాలలో అనేక ఇతర కంపెనీల భాగస్వామ్యం కల్పించే అంశం పైనా చర్చించామని వెల్లడించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

## ప్రపంచకప్ మేం నిర్వహించలేం..

న్యూఢిల్లీ,మహిళల టీ20 ప్రపంచకప్ బంగ్లాదేశ్‌లో జరగనుంది. అయితే, ప్రస్తుతం బంగ్లాతో పరిస్థితులు అంత అనుకూలంగా లేవు. దీంతో బంగ్లా ఆతిథ్యంపై ప్రశ్నలు మొదలయ్యాయి. దీనిపై ప్రస్తుతానికి ఐసీసీ కూడా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, ఈ ఐసీసీ ఈవెంట్ బంగ్లా నుంచి తరలొచ్చని అంటున్నారు. ఈ క్రమంలో బీసీసీఐ కార్యదర్శి జైషా కీలక స్టేట్‌మెంట్ చేశాడు. బీసీసీఐ కార్యదర్శి జయ్ షా ప్రకారం, మహిళల టీ20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. ఈ ఐసీసీ ఈవెంట్‌ను చేపట్టేందుకు భారత్ నిరాకరించింది. బంగ్లాదేశ్‌లో ఈ టోర్నీ అక్టోబర్‌లో టోర్నీ జరగనుంది. విద్యార్థుల నిరసనల కారణంగా ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి వెళ్లవలసి వచ్చింది. ఇది తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటుకు దారితీసింది.బంగ్లాదేశ్‌లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు మహిళల %u%20 ప్రపంచకప్‌నకు ఆతిథ్యమివ్వగల అవకాశాలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. రాజకీయ అస్థిరత కారణంగా మరో దేశం ముందుకు రావచ్చని ఊహాగానాలు వచ్చాయి. భారతదేశం, శ్రీలంక, %ఖూజు% సాధ్యమైన ఎంపికలుగా పరిగణిస్తున్నారు.టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జై షా భారత్ నిర్ణయం గురించి చెప్పుకొచ్చాడు. మహిళల టీ20 ప్రపంచకప్‌ను భారత్‌లో నిర్వహించాలన్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అభ్యర్థనను తిరస్కరించామని తెలిపాడు. వచ్చే ఏడాది మహిళల వన్డే ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో టీ20 ప్రపంచకప్‌ను నిర్వహించేందుకు అవకాశాలు తక్కువగా ఉన్నాయంటూ తెలిపాడు.

## బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది అబద్ధం

హైదరాబాద్,బీజేపీ లో బీఆర్ఎస్ విలీనం అనేది శుద్ధ అబద్ధమని.. అలాంటి చర్చ బీజేపీ లో లేదని బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఏమైనా మాట్లాడుకుంటునరేమో.. దాన్ని బట్టి కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ ఉండొచ్చని కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ మమ అనిపించిందని మండిపడ్డారు. పూర్తి స్థాయి లో రుణమాఫీ ఈ ప్రభుత్వం చేయలేదు.. ప్రజల్ని రైతుల్ని సీఎం మోసం చేశారని అన్నారు. హైడ్రా పేరుతో అడ్డగోలుగా కూల్చివేతలు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. అడ్డగోలుగా కూలగొట్టి అధికారం వారికి ఎవరు ఇచ్చారన్నారు. పరిధిలో ఉన్న భూములు ప్రభుత్వ భూములు కాదు.. అవి రైతులవి అన్నారు. అప్పట్లో ఎందుకు నిర్మాణాలకు అనుమతి ఇచ్చారన్నారు. ఇక పై నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దన్నారు. RR లోపల ప్రాంతాల విలీనం అనేది ఏదో గీతలు గీసినట్టు ఉండకూడదు అన్ని అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలన్నారు. బీజేపీ గ్రాఫ్ ఏమీ పడిపోలేదు%ొ% ఒక్కో సారి ఒక్కోలా ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్ష మార్పు పై నాకు ఎలాంటి సమాచారం లేదు%ొ% పార్టీ చూసుకుంటుందని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడుల విషయం లో గతంలో కేటీఆర్ మాట్లాడినట్టే రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని తెలిపారు. వేల కోట్ల పెట్టుబడులు అనేది తప్పన్నారు. లోకల్ వారిని ప్రోత్సహించాలన్నారు.

# విప్లవాత్మక జిఎస్టీపై పునరాలోచన ఏదీ ?




న్యూఢిల్లీ,భారత్ లాంటి దేశాల్లో పన్నులు సరళీకృతంగా ఉండాలి. ఒకే పన్ను విధానం అంటూ జిఎస్టీని తీసుకుని వచ్చినా పన్నుల భారాలపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించడం లేదు. ప్రతి పనికి జిఎస్టీని విధించడం దారుణం కాక మరోటి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్, బీమా మొత్తాలపై జిఎస్టీ విధించడం దారుణం కాక మరోటి కాదు. దీనిపై ఇటీవల పార్లమెంటులో ప్రస్తావనకు వచ్చినా ఆర్థికమంత్రి చెప్పిన సమాధానం ప్రజలను అవమానించేదిగా ఉంది. దీనిని ప్రస్తావించిన కేంద్రమంత్రి నితిని గడ్కరీని కూడా నిర్మలా సీతరామన్ అవమానించారు. ఒక్కరు ప్రస్తావించిన అంశాన్ని 200మంది పట్టుకుని సాగదీసారని తన తలబిరుసు సమాధానంతో చెప్పారు. పెట్రో ధరలపై జిఎస్టీ విధించడం లేదు. గ్యాస్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేశారు. ప్రజలు కడుతున్న పన్నులతో పాలకులు రాజ్యాలు ఏలుతున్నారు. తమ సుఖాలకు ఖర్చు చేస్తున్నారు. పథకాల పేరుతో వంచన చేస్తున్నారు. నిజానికి జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి పరిమితం చేయాలి. పన్నుల పేరుతో ఎలా బాదుతున్నారో చర్చించాలి. ఇల్లు కొనాలంటే రకరకాలు పన్నుల రూపంలో బాదేస్తున్నారు. రిజస్ట్రేషన్లకు రాష్ట్రాలు లక్షల్లో వసూలు చేస్తున్నారు. మధ్య తరగతి ప్రజలను పీల్చి పిప్పి చేస్తున్నారు. ఇలా రకరకాల పన్నులపై చర్చించాలి. అవసరమైతే పార్లమెంటులో ప్రత్యేకంగా చర్చించే ధైర్యం చేయాలి. బ్యాంకుల రుణ వితరణలో లక్ష కోట్ల రూపాయల తరుగుదల కనిపించిందని గతేడాది రిజర్వుబ్యాంకు వెల్లడించడం గమనిస్తే, గిరాకీ మందగించడం వల్లనే కొత్త పరిశ్రమలు, వ్యాపారాలను పెట్టడానికి రుణాలు తీసుకునేవారు కరవవుతు న్నారని స్పష్టమవుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తరచూ మాంద్యానికి గురవుతూనే ఉంటుంది. అది సహజ పరిణామం కూడా. ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలు ఒక సరళ సూత్రాన్ని పాటించి విజయం సాధించాయి. భారత్ కూడా అలాంటి ఉద్దీపన విధానాన్ని చేపట్టాలి. కొన్ని రంగాలు తమ సామర్థ్యం మేరకు ఉత్పత్తి సాగించలేక పోయాయి. ప్రభుత్వం తన వ్యయాన్ని పెంచితే ఆర్థిక వ్యవస్థలోకి ధన ప్రవాహం, దానితోపాటే గిరాకీ పెరిగి, పరిశ్రమలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత ఎక్కువగా వినియోగించుకుంటాయి. దీనికి ఉద్దీపనలు ఇవ్వాలే తప్ప కొందరు కార్పోరేట్లకు రుణాలను మాఫీచేయడం, ఎగవేతదారుల రుణాలను మాఫీ చేయడం దేశ అభివృద్ధి కాదు. అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడే భాగ్యం కలిగిందని సంతోషపడుతున్న వేళ రూపాయితో పోల్చుకుంటే మనం ఎప్పటికీ బలహీనంగానే ఉంటున్నాం. బలహీన దేశాలైన సూడాన్ లాంటి దేశాల్లో మాత్రమే మనం బలవంతులం. 78ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న వేళ వెనక్కి తిరిగి చూస్తే మన ఆర్థిక ప్రగతి బలపడిందా లేక బలహీన పడిందా అన్నది రూపాయిని అడిగితే చెబుతుంది. ప్రధానంగా మనం రూపాయిని డాలర్‌తో పోలిస్తేనే మన బలం గురించి తెలుస్తుంది. డాలర్ మనకు అందనంతగా ఎదిగి పోతోంది. ఇది డాలర్ బలమో లేక మన రూపాయి బలహీనతో కానీ పాలకులు మాత్రం ఘనంగా అభివృద్ధి గు రించి ఢంకా బజాయిస్తున్నారు. అంతెందుకు నోట్ల రద్దు జరగక ముందు ఉన్న 500 రూపాయల విలువ ఇప్పుడు పది వంద నోటుకు లేదంటే నమ్మగలమా? కానీ నమ్మాలి. ఆనాటి 500 నోటు ఇవాళ్టి వంద నోటు ఒకటే అన్న సంగతి బజారులో అడుగుపెడితే సామాన్యుడే చెబుతాడు. ప్రతి భారతీయుడికి ఇల్లు, విద్యుత్తు, గ్యాస్, నీరు, మరుగుదొడ్డి, నైపుణ్యాభి వృద్ధి, వైద్యం, బీమా వంటి సౌకర్యాలు అందాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పడం కాదు చేసి చూపాలి. అప్పుడే దేశం పురోగమిస్తుంది. అందుకు క్షేత్రస్థాయిలో చర్చించాలి. ప్రజల నుంచి సమాచారం సేకరించాలి.


# సత్యసాయి జిల్లా కేంద్రం మార్పు..!

హిందూపురం,శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం మార్పుపై హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.. శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రంగా పుట్టపర్తి కాకుండా హిందూపురాన్ని జిల్లా హెడ్ క్వార్టర్ గా చేయాలంటూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు బాలయ్య.. ఈ రోజు తన నియోజకవర్గంలో పర్యటించిన ఆయన.. అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు.. స్వయంగా టిఫిన్ వడ్డించారు.. ఆ తర్వాత పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ బిజీబిజీగా గడిపారు.. అయితే, ఈ పర్యటనలోనే ఆయన హిందూపురంను జిల్లా కేంద్రంగా మార్చాలనే ప్రతిపాదనలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు.. ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు.. అంతేకాదు.. సత్యసాయి జిల్లా పేరులో ఎలాంటి మార్పు చేయకుండా.. జిల్లా హెడ్ క్వార్టర్ ను హిందూపురం చేయాలంటూ గతంలోనే బాలకృష్ణ ఆందోళన చేపట్టిన విషయం విదితమే.. తాజాగా బాలకృష్ణ వ్యాఖ్యలతో మరోసారి సత్యసాయి జిల్లా కేంద్రం మార్పు తప్పదా? అనే చర్చ నడుస్తోంది. కాగా, శ్రీ సత్యసాయి జిల్లా ఆంధ్రప్రదేశ్లో ఒక జిల్లా జిల్లాల పున ర్వ్యవస్థీకరణ



భాగంగా 2022లో పాత అనంతపురం జిల్లాలో నుండి ఈ జిల్లా ఏర్పడింది. జిల్లా కేంద్రం పుట్టపర్తిగా నిర్ణయించారు.. అయితే, శ్రీ సత్య సాయి జిల్లాలో పెద్ద పట్టణంగా హిందూపురం ఉంది.. దాంతో.. అప్పటి నుంచి అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న నందమూరి బాలకృష్ణ.. హిందూపురంను శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ వినిపిస్తూ వస్తున్నారు. మరి, ఇప్పుడు ప్రభుత్వం కూడా మారడంతో అటువైపు అడుగులు పడతాయేమో చూడాలి.

# పారిపోండిరోయ్..రెడ్ బుక్ ఓపెనవుతోంది !



అమరావతి,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏపీలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ప్రజలు, వ్యాపారులు ధైర్యంగా తమ పనుల్లో ని మగ్నమవుతున్నారు. బెదిరింపులు, అక్రమ అరెస్టులు, పోలీసుల అర్ధరాత్రి దాడులు, గోడలు దూకి, తలుపులు పగులగొట్టి తీసుకువెళ్లడాలు క నుమరుగయ్యాయి. పాలనా పరంగా అపార అనుభవం కలిగిన సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏపీ అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోంది. రాజధాని అమరావతి నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయి. త్వరలో పోలవరం ప్రాజెక్టు పనులు ఊపందుకోనున్నాయి. మరోవైపు ఎన్నికల సమ' ప్రజలయంకు ఇచ్చిన హామీల అమలు పైనా ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే కొన్ని పథకాలను అమలు చేస్తోన్న ప్రభుత్వం.. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా వంద అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ఒకపక్క రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెడుతూనే.. మరోపక్క గత వైసీపీ హయాంలో అవినీతి అక్రమాలలు, దౌర్జన్యాలు, భూకబ్జాలకు పాల్పడిన వైసీపీ నేతలు, వారికి సహకరించిన అధికారులపై చంద్రబాబు కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే పలువురు వైసీపీ నేతలపై కేసులు నమోదు అయ్యాయి, అరెస్టులు కూడా జరిగాయి. త్వరలో మంత్రి నారా లోకేశ్ కూడా రంగంలోకి దిగలని గుర్తించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయం ఆయన రెడ్ బుక్‌లో చట్టం పరిధి దాటి ప్రవర్తించిన వైసీపీ నేతలు, అధికారుల పేర్లను నమోదు చేశారు. ప్రస్తుతం లోకేశ్ ఆ రెడ్ బుక్ ఓపెన్ చేయబోన్నారు. దీంతో వైసీపీ హయాంలో హద్దులు దాటి ప్రవర్తించిన వైసీపీ నేతలు, కొందరు అధికారులు విదేశాలకు పారిపోయేందుకు సిద్ధమవుతున్నారని ఏపీ రాజకీయ వర్గాల్లో టాక్ నడుస్తోంది. రెడ్ బుక్ పేరు వింటే వైసీపీ నేతలు, అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. జగన్ ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలపై పెద్ద ఎత్తున వైసీపీ నేతలు దాడులకు పాల్పడ్డారు. పలు ప్రాంతాల తెలుగుదేశం జెండా కట్టిన నేతలను హత్యలు సైతం చేశారు. పోలీసులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో తెలుగుదేశం జెండా పట్టుకునేందుకు ఆ పార్టీ కార్యకర్తలు భయపడే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల భూములను ఆక్రమించడం, ప్రభుత్వం తీరును ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం వంటి దారుణాలు జగన్ హయాంలో నిత్యకృత్యంగా కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలు సైతం వైసీపీ నేతలకు ఎదురు నిలబడే సాహసం చేయలేక పోయారు. అప్పట్లో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రనూ అడ్డుకునేందుకు జగన్ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. ప్రభుత్వ కుట్రలను పూర్తిగా ఎదుర్కొని లోకేశ్ పాదయాత్రను చేశారు. ఈ పాదయాత్ర ప్రారంభం నుంచే వైసీపీ ప్రభుత్వంలో చట్టానికి విరుద్ధంగా నడచుకున్న నేతలు, అధికారుల పేర్లను లోకేశ్ రెడ్‌బుక్‌లో రాయడం మొదలెట్టారు. అప్పటి నుంచి ఎన్నికల్లో చివరి ప్రచార సభ వరకు లోకేశ్ రెడ్ బుక్ మెయింటెన్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత రెడ్ బుక్‌లో పేర్లు ఉన్న వైసీపీ నేతలు, అధికారులను వదిలిపెట్టేది లేదని, చట్టపరంగా చార్యలు తీసుకుంటామని లోకేశ్ ప్రతీ సభలో చెబుతూ వచ్చారు. అప్పట్లో లోకేశ్ రెడ్ బుక్ ను లైట్ గా తీసుకున్నవారు.. ఇప్పుడు రెడ్ బుక్ అంటేనే వణికిపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళున్నది. మరోవైపు వైసీపీ హయాంలో అవినీతి అక్రమాలకు, భూకబ్జాలకు, చట్టం పరిధిదాటి ప్రవర్తించిన వైసీపీ నేతలపైనా, వారికి సహకరించిన అధికారులపైనా కొరఢా ఝుళిపిస్తున్నారు. ఈ క్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతిపై విచారణ సాగుతోంది. మాజీ మంత్రి ద్వారంపూడి చంద్రశేఖర్ రేషన్ బియ్యం దందాపైనా విచారణ జరుగుతోంది. అంతేకాదు.. దేవినేని అవినాశ్, లేళ్ల అప్పిరెడ్డి, రఘురాం తదితరులపై తెలుగు దేశం ప్రధాన కార్యాలయంపై దాడికి సంబంధించిన కేసులు నమోదు కాగా.. బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు జోగి రాజీవ్ అరెస్టు అయ్యారు. అదే కేసులో జోగి రమేశ్ విచారణకు హాజరయ్యారు. పులివర్తి నానిపై దాడి కేసులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడిపై విచారణ జరుగుతుంది. ఇలా చాలా మందిపై కేసులు ఉన్నాయి. అయితే, ప్రతీకేసు కక్ష సాధింపు అంటూ జగన్ మోహన్ రెడ్డి గగ్గోలు పెడుతున్నారు. లోకేశ్ రెడ్ బుక్ ప్రకారమే ఇదంతా జరుగుతుందంటూ ఢిల్లీ ధర్నాలోనూ గగ్గోలు పెట్టారు. కానీ, రెడ్ బుక్ ఇంకా తెరుచుకోలేదని లోకేశ్, టీడీపీ నేతలు పలు సందర్భాల్లో చెబుతూ వచ్చారు. రెడ్ బుక్‌పై తాజాగా మంత్రి లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లాలో అన్న క్యాంటిన్ ప్రారంభం త రువాత లోకేశ్ మాట్లాడుతూ.. రెడ్ బుక్ గురించి ప్ర స్తావించారు. ఎన్నికల సమయంలో ప్రతి ఊళ్లో రెడ్ బుక్ మీద ప్రజలకు తాను హామీ ఇచ్చానని అన్నారు. ప్రజలకు ఎర్రబడ్డ ప్రతి తప్పుపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చానని, ఆ మాటల్ని ఎన్నికల్లో ప్రజలు నమ్ముతున్నారని, రెడ్ బుక్ మ్యాండేట్ ఖచ్చితంగా అమలులో ఉందని నా చూపించరా లోకేష్ చెప్పారు. దీంతో త్వరలో రెడ్ బుక్ తెరుచుకోబోతుందని లోకేశ్ చెప్పకనే చెప్పారు. లోకేశ్ వ్యాఖ్యలతో వైసీపీ హయాంలో చట్టటానికి విరుద్ధంగా వ్యవహరించిన వైసీపీ నేతలు, అధికారులు వణికిపోతున్నారు. దీంతో రెడ్ బుక్ తెరుచుకోక ముందే దేశం వదిలి పారిపోయేందుకు పలువురు వైసీపీ నేతలు, అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

# త్వరలోనే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభం



అమరావతి,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రాజెక్టుల్లో కీలకమైనది పోలవరం ప్రాజెక్టులు.. అయితే, పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసిన విదేశీ నిపుణుల బృందం కీలక సూచనలు చేసింది. వర్షాకాలం దాటగానే పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చించేందుకు వర్క్ షాప్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందులో పోలవరం ప్రాజెక్ట్ డిజైనర్, ప్రాజెక్టను పర్యవేక్షించే ఇంజినీర్ల బృందం, విదేశీ నిపుణుల బృందం ఉండాలని సూచించింది. డిజైన్ల రూపకల్పన, నిర్మాణ షెడ్యూలు నిర్ణయించడం, అందుకుతగ్గ వనరులు ఏవేంకావాలో ఈ వర్క్‌షాప్‌లో ఒక స్పష్టతకు రావాలని అభిప్రాయపడింది.. ప్రధాన డ్యాం ప్రాంతం పొడవునా సీపేజీ నీటిమట్టానికి 8 మీటర్ల ఎత్తులో ఒక ప్లాట్‌ఫాం నిర్మించాలని.. దాన్నుంచి ఎప్పుడూ నీటి మట్టం 8 మీటర్ల కన్నా దిగువన ఉండేలా పంపింగ్ ఏర్పాట్లు చేయాలని బృందం స్పష్టం చేసింది.. ఈ ఏర్పాట్లు వచ్చే వానాకాలంలో కూడా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవాంతరాలు కలిగించని స్థితిలో ఉండేలా చూడాలని విదేశీ నిపుణుల బృందం సూచించింది.కాగా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన సీఎం చంద్రబాబు.. అప్పటి వరకు జరిగిన పనులపై ఆరా తీశారు.. ఆ తర్వాత.. పోలవరం ప్రాజెక్టు సవాళ్లపై అధ్యయనం చేసేందుకు విదేశీ నిపుణుల బృందాన్ని నియమించిన విషయం విదితమే.. ఇక, ఆ విదేశీ నిపుణుల బృందం.. క్షేత్రస్థాయిలో ప్రాజెక్టును పరిశీలించింది.. ఇప్పుడు డిజైన్ మార్పులతో కొత్త డయాఫ్రం వాల్, ప్రధాన డ్యాం నిర్మించాలని కీలక సూచనలు చేసింది.. ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజిని పూర్తిగా నియంత్రించాలంటే ఎక్కువ ఖర్చువతుంది కాబట్టి.. వాటి జోలికి పోకుండా.. ఆ కాఫర్ డ్యాంలతోనే ముందుకు సాగాలని విదేశీ నిపుణుల కమిటీ సూచించింది.. ఇక, ఈ ఏడాది వర్షాకాలం దాటగానే పనులు ప్రారంభించేందుకు వీలుగా డిజైన్, నిర్మాణ అంశాలు చర్చించేందుకు ఒక వర్క్‌షాప్ ఏర్పాటు చేయాలని పేర్కొన్న నిపుణుల కమిటీ.. ఆ వర్క్‌షాప్‌లో ప్రాజెక్టుపై ఒక స్పష్టతకు రావాలని సూచించింది.

# విషం చిమ్ముతున్న బిఆర్ఎస్ నేతలు

హైదరాబాద్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్‌లో కూర్చొని కొత్త వేషంలో ప్రజల్ని ఎలా మోసం చేయాలని ఆలోచిస్తుంటే.. కేటీఆర్, హరీశ్ రావులు కాంగ్రెస్‌పై విషం చిమ్ము తున్నారని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఏ మంచి పని చేసినా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కేటీఆర్, ఆ పార్టీ నేతలు బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి వారిపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 8నెలల్లోనే అనేక కార్యక్రమాలు చేస్తుంటే కేటీఆర్, హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని శ్రీనివాస్ రెడ్డి ధ్వజమెత్తారు. వీరిద్దరూ అధికారం పోయిన ఫ్రస్టేషన్‌లో ఉన్నట్లు అర్థం అవుతోందని ఆయన ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి బీఆర్ఎస్ నేతలు తెలంగాణ ప్రజల సొమ్ము దోచుకున్నారని, అపరిచితుడు సినిమాలో ఉండే శిక్షలన్నీ కేసీఆర్ కుటుంబానికి వేయాలని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్న మహిళలపై రికార్డింగ్ డ్యాన్సులు అంటూ కేటీఆర్ అనుచిత వాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇదేనా మీ సంస్కారం అంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్, హరీశ్ రావులు సిరిసిల్ల, సిద్దిపేటలో కాకుండా బయటకు వచ్చి పోటీ చేయాలని శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో హరీశ్ రావు ఇరిగేషన్ మంత్రిగా అవినీతి ప్రాజెక్టులు కట్టారని ఆయన ఆరోపించారు. మీ పదేళ్ల పాలనలో రూ.1.30లక్షల కోట్ల అప్పులు చేశారని మండిపడ్డారు. అలాంటి మీరు ఇంకా విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీ విధ్వంసకర పాలన నుంచి రాష్ట్ర ప్రజలకు విముక్తి కలిగిందని అన్నారు. తెలంగాణకు దిష్టి చుక్కలుగా మీరిద్దరూ మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. కాగ్నిజెంట్ శంకుస్థాపన ఎలా సాధ్యం అని కేటీఆర్ విమర్శిస్తున్నారు. మా ప్రభుత్వం చిత్తశుద్ధి చూసి పెట్టుబడులు పెట్టేందుకు వారు ముందుకు వచ్చారని ఎమ్మెల్యే చెప్పుకొచ్చారు. మీరు కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారని తెలిసి అప్పట్లో వారు వెనకడుగు వేశారని ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు పాలన చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు అనడానికి సిగ్గుండాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి తన సోదరులకు రాజ్యసభ సీటు ఇచ్చారా లేక కాంట్రాక్టులు ఇచ్చారా అంటూ ఆయన ప్రశ్నించారు. అలాంటి పనులు చేయాల్సిన అవసరం సీఎంకు లేదన్నారు. మీ ఎమ్మెల్యేలకు మీ మీదే నమ్మకం లేదని చెప్పుకొచ్చారు. హరీశ్ రావు



ప్రతిపక్ష నేత కుర్చీలో కూర్చోవాలని రోజూ హంగామా చేస్తున్నారని, ముక్కు నేలకు రాసినా కల్వకుంట్ల కుటుంబం ఆయనకు ఏ పదవీ ఇవ్వదని ఎద్దేవా చేశారు. కష్టపడే నాయకుడని హరీశ్ రావుకు పేరుందని, దాన్ని కాపాడుకుంటే రాజకీయ భవిష్యత్ ఉంటుందని హితవుపలికారు. తెలంగాణ విధ్వాసానికి ఆయన కూడా కారణమని, తాను చేసిన తప్పులను ఇప్పటికైనా ఆయన సరిదిద్దుకోవాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి హితబోధ చేశారు.

## విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బొత్స ఏకగ్రీవ ఎన్నిక..

అమరావతి,విశాఖ స్థానిక సంస్థల కోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఏపీ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎంపిక అయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన విడుదల చేసింది. మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగబోతున్నారు. అయితే, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా పదువులు చేపట్టి బొత్స సత్యనారాయణ రికార్డు సృష్టించారు. అయితే, బొత్స సత్యనారాయణ ఎన్నిక ప్రకటన తర్వాత విశాఖ కలెక్టరేట్ దగగర సందడి వాతావరణం కొనసాగుతుంది. జాయింట్ కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు సర్టిఫికెట్ తీసుకున్న తర్వాత బొత్స మీడియాతో మాట్లాడుతూ.. బీ ఫామ్ ఇచ్చి పోటీకి ప్రొత్సహించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్? జగన్ మోహన్ రెడ్డికి, సహకరించిన జిల్లా నేతలకు ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.. ఉమ్మడిగా కలిసి జిల్లా అభివృద్ధికి భాగస్వాములు కావాలి కృషి చేస్తాను అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

# సీతక్క.. ఇసుక అధికారిగా పోస్టు

వరంగల్, ఇసుక ఎక్కువగా లభించే ములుగు జిల్లాలో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఇసుక తవ్వకాల పర్యవేక్షణ అధికారిగా పోస్టింగ్ దక్కుతోంది. పంచాయతీరాజ్ మంత్రి సీతక్క వారికే ఆమె సొంత జిల్లా ములుగు టీజీఎండీసీ ప్రాజెక్టు అధికారిగా పోస్టింగ్ దక్కింది. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, లారీల్లో లోడింగ్ పర్యవేక్షణ అంతా తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) ఆధ్వర్యంలోనే జరుగుతుంది.నదులు, నదుల వెంట ఉన్న ప్రైవేటు భూముల్లో ఇసుక తవ్వకాలు, లోడింగ్, రవాణా పర్యవేక్షణ కోసం ఇసుక వనరులు ఉన్న జిల్లాకు ప్రత్యేకంగా ప్రాజెక్టు అధికారులు నియమిస్తున్నారు. ములుగు జిల్లాలో మాత్రం మంత్రి సీతక్క చెప్పిన వారికే ఈ పోస్టు దక్కింది.గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో హైడ్రోజియోలజిస్టుగా పనిచేస్తున్న అలువాల శ్రీకాంత్ ఇటీవలే పీవోగా విధుల్లో చేరారు టీజీఎండీ ములుగు జిల్లా ప్రాజెక్టు అధికారిగా. పీవో పోస్టు కావాలని ఆయన జూన్ 4న దరఖాస్తు చేసుకున్నారు. రెండు నెలల వరకు దరఖాస్తు కదలలేదు. శ్రీకాంత్‌కు పోస్టింగ్ అందించిన సీతక్క డైరెక్టర్ 8న టీజీఎండీసీ మేనేజింగ్‌కు స్వయంగా లేఖ పంపారు. ఈ లేఖ అందగానే అధికార యంత్రాంగం వేగంగా స్పందించింది. ఎండీసీలో పనిచేసే శ్రీకాంత్‌కు అనుమతి ఇవ్వడంతోపాటు సొంత శాఖ నుంచి రిలీవ్ చేస్తూ గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ డైరెక్టర్ 7న టీజీఎండీసీకి లేఖ ఇచ్చారు.9న ఆయన విధుల్లో చేరారు. ములుగు ఏర్పాటు 102 ఎకరాల్లో 11 ఇసుక క్వారీలను మైనింగ్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పీసా గ్రామ సభలను నిర్వహించి ఆదివాసీ సంఘాలు, నిబంధనల ప్రకారం ఇతరులకు ఈ క్వారీలను కేటాయించారు. మంగపేట మండలం మల్లూరు, చుంచుపల్లిలో.. వాజేడు మండలం అయ్యవారిపేట, ధర్మవరం, రాంపూర్‌లో.. వెంకటాపురం(నూగూరు) మండలం మొర్రివానిగూడెం, శ్రీరంగపురం, కేకొండాపురం, ఒంటి చింతగూడెంలో క్వారీలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో



ఎనిమిది ఇసుక క్వారీలు నడుస్తున్నాయి.నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన ప్రతి ఇసుక క్వారీ, స్టాకు యార్డు, ఇసుక లోడింగ్ వంటి ప్రక్రియ టీజీఎండీసీ పీవో పర్యవేక్షణలోనే జరుగుతాయి. గోదావరి నది నుంచి రోజూ వందల లారీల్లో ములుగు జిల్లా నుంచి వరంగల్, హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా అవుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నేతల మద్దతు, అధికారుల సహకారంతో కోట్ల రూపాయల ఇసుక వ్యాపారం జరుగుతోంది.

## నా కొడుకుపై తప్పుడు కేసులు

మంగళగిరి,మంగళగిరిలో మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసు విచారణ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత స్పీకర్ అయ్యన్న పాత్రుడు అప్పటి సీఎం జగన్ పై అసభ్య పదజాలంతో తిట్టారు.. అందుకే నేను చంద్రబాబు దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేయాలని వెళ్లాను.. నిరసన తెలుపుతున్న నాపై దాడి చేసారు.. రాజకీయాల్లో విలువలు, విశ్వస నీయత అవసరం.. ప్రజలు మంచి విజయాన్ని ఇచ్చారు.. పాలకులు కక్షపూరిత వాతావరణంలో రాజకీయాలు చేస్తే ప్రజలు అన్ని గమనిస్తూనే ఉంటారు

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com